RNI NO: APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 162, | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజిలు : 8 | వెల రూ. 2 | శనివారం - 12 - సెప్టెంబర్ - 2026

Published From:Kadapa.circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Telangana

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

### 2029 లక్ష్యంగా కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు




ఢిల్లీ,: 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులకు అగ్ర నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ జాతీయ కార్యదర్శుల నియామకాల కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ వాద్రాతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.

## బ్రిక్స్ కూటమితో భారత్‌కు లాభమేంటి?..

### కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు.. చిదంబరానికి శశి థరూర్ కౌంటర్!




ఢిల్లీ,: భారత్ ఆతిథ్యంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రారంభం కానున్న తరుణంలో ఈ కూటమి వల్ల దేశానికి కలిగే ప్రయోజనాలపై కాంగ్రెస్ పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. బ్రిక్స్ వల్ల భారత్‌కు చేకూరిన స్పష్టమైన ప్రయోజనాలు ఏమిటని పార్టీ సీనియర్ నేత పి. చిదంబరం ప్రశ్నించగా, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాత్రం ఈ కూటమి ప్రాధాన్యతను గట్టిగా సమర్థించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాలకు ఒక ముఖ్యమైన వేదిక అని, భారత్ దౌత్య శక్తికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మాట్లాడిన శశి థరూర్.. ఈ కూటమి ప్రాముఖ్యతను వివరించారు. 11 దేశాల ఈ సమూహం ప్రపంచ జనాభాలో,

## మూసీ ప్రక్షాళనపై కొత్త ట్విస్ట్.. రేవంత్ సర్కార్‌కు ఎన్జీటీ నోటీసులు!




హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన సవాల్ ఎదురైంది. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు,




## మా జుట్టు పట్టుకుని లాగారు: ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయమానవహక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేలబృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది.

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

- ★ వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- ★ సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- ★ హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- ★ భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- ★ రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్




హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస




హైదరాబాద్, : శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను

## బ్రిక్స్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

- పుతిన్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక కానుక.. ఏమిటీ 'తిరుక్కురళ్' ప్రాధాన్యత?
- రష్యా అధ్యక్షుడికి 'తిరుక్కురళ్' రష్యన్ అనువాదం బహూకరణ
- తమిళ ప్రాచీన సాహిత్య గ్రంథం తిరుక్కురళ్
- మానవతా విలువలు, నైతికతపై తిరువళ్లువర్ చేసిన రచన

ఢిల్లీ,: బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ,







## ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

## బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం.. ఢిల్లీకి వచ్చే దేశాధినేతల పూర్తి జాబితా ఇదే!




- ఢిల్లీ వేదికగా నేటి నుంచి బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- హాజరు కానున్న రష్యా, చైనా అధ్యక్షులు సహా పలువురు అగ్రనేతలు
- ప్రధాని మోదీతో వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేకంగా భేటీ
- ఆహార, ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలపై ప్రధానంగా చర్చ
- అగ్రనేతల రాకతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి - కలెక్టర్లకు మంత్రి లోకేశ్ ఆదేశం..




అమరావతి: పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే.. ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

- దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం
- సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన
- క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం




అమరావతి,: ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.

నెల రోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.. రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు




- ❖ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన షర్మిల
- ❖ కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- ❖ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత




- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత,

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

మొదటి పేజి తరువాయి

ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. దాదాపు 120 మంది నేతలను ఇందుకు ఎంపిక చేశారు. గ్రూపులుగా విభజించి ఒకేసారి 10 మందిని రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అభ్యర్థుల ప్రొఫైల్, గతంలో చేసిన పనులు, రాజకీయ దృక్పథంపై రాహుల్ ప్రశ్నలు అడుగుతుండగా, ప్రియాంకా గాంధీ మరిన్ని వివరాలు రాబడుతున్నారు. ఈ నియామకాల్లో యువతకు, 'సంగఠన్ సృజన్' కార్యక్రమంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జాతీయ కార్యదర్శుల్లో 60 శాతానికి పైగా మార్పులు తప్పవని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు, పార్టీలో మరిన్ని కీలక మార్పులు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రియాంకా గాంధీని చైర్‌పర్సన్‌గా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలాగే, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదవీ విరమణ చేయవచ్చని, ఆయన స్థానంలో కేసీ వేణుగోపాల్‌ను నియమించవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, అక్టోబర్ చివరి నాటికి జిల్లా అధ్యక్షుల నియామకాలు పూర్తి చేస్తామని కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ మార్పుల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మార్పుపైనా చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారని, దీంతో ఆమె స్థానంలో కొత్తవారిని నియమించవచ్చని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆమె తన బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. రాష్ట్రంలో పార్టీ సమన్వయం, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై దృష్టి సారించారు. మొత్తంగా ఈ మార్పుల ద్వారా 2029 నాటికి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## బ్రిక్స్ కూటమితో భారత్‌కు లాభమేంటి?..
## కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు.. చిదంబరానికి శశి థరూర్ కౌంటర్!

మొదటి పేజి తరువాయి

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మాట్లాడిన శశి థరూర్.. ఈ కూటమి ప్రాముఖ్యతను వివరించారు. 11 దేశాల ఈ సమూహం ప్రపంచ జనాభాలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. "గ్లోబల్ సౌత్‌లో 100కు పైగా దేశాలు ఉన్నాయి. కానీ ఇక్కడ గ్లోబల్ సౌత్‌కు చెందిన 11 కీలక దేశాలు ఉన్నాయి. ఇవి ఆ దేశాల విభిన్న అభిప్రాయాలకు సమష్టిగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి" అని థరూర్ తెలిపారు. ఈ కూటమి ప్రపంచ జనాభాలో మెజారిటీ వాటాను, గ్లోబల్ జీడీపీలో 41 శాతం వాటాను కలిగి ఉందని, కాబట్టి ప్రపంచ దేశాలు దీనిని చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అన్నారు. సభ్య దేశాల అధినేతలు, పరిశీలకులు ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ప్రపంచంలోని కీలక దేశాలను ఒకే వేదికపైకి తీసుకురాగల భారత్ సామర్థ్యం ప్రదర్శితమవుతుందని థరూర్ చెప్పారు. ఇది దేశానికి గర్వకారణమని, ప్రపంచ వేదికపై భారత్‌కు ఉన్న 'దౌత్యపరమైన సమావేశ శక్తి'కి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'ఎన్డీటీవీ' కథనం ప్రకారం.. బ్రిక్స్ కూటమిలో భాగస్వామ్యం వల్ల భారత్‌కు లభించిన ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలేమిటని చిదంబరం సందేహాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నేటి నుంచి రెండు రోజుల పాటు 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు భారత్‌లో జరగనుంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు కొత్తగా చేరిన ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మొత్తం 11 అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం'' అనే థీమ్‌తో 2026 సంవత్సరానికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఈ సదస్సు ద్వారా బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలలో మౌలిక సదుపాయాలు, ఇంధనం, డిజిటల్ రంగాల్లోని ప్రాజెక్టులకు నేరుగా నిధులు సమకూర్చే వేదికను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మూసీ ప్రక్షాళనపై కొత్త ట్విస్ట్..
## రేవంత్ సర్కార్‌కు ఎన్జీటీ నోటీసులు!

మొదటి పేజి తరువాయి

మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతుల విషయంలో లోపాలున్నాయని అప్పీల్‌దారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ వారు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారం మరోసారి న్యాయస్థానం ముందుకు వచ్చింది. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే స్టడీ చేశారు. అలాగే ఈ రీజియన్‌లోనే మృగవాణి నేషనల్ పార్క్ ఉంది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నోటీసులు

అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్ ముందు ఉంచాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. దీంతో ప్రాజెక్టుకు అప్పట్లో ఊరట లభించింది.

వచ్చే నెల 16న విచారణ

తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. దీంతో ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నది ప్రక్షాళనతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి, మురుగునీటి సమస్య పరిష్కారం వంటి చర్యలను ప్రభుత్వం చేపడుతోంది. అయితే ప్రాజెక్టు పర్యావరణ ప్రభావం, అనుమతుల ప్రక్రియపై మొదటి నుంచీ వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఎన్జీటీలో దాఖలైన అప్పీల్‌తో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## మా జుట్టు పట్టుకుని లాగారు
## - ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజి తరువాయి

శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

## రేవంత్ సీఎం అవడం..
## వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

మొదటి పేజి తరువాయి



భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం.. ఢిల్లీకి వచ్చే దేశాధినేతల పూర్తి జాబితా ఇదే!

ఢిల్లీ,: బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సుకు భారత రాజధాని ఢిల్లీ సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో (శని, ఆదివారాలు) జరగనున్న ఈ కీలక సమావేశాల కోసం ప్రపంచ దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు ఇప్పటికే భారత్‌కు చేరుకుంటున్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సహా పలువురు ప్రపంచ స్థాయి నేతలు హాజరవుతుండటంతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

భారత్‌కు విచ్చేయుచున్న అతిథులు వీరే..

ఈ సదస్సు కోసం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరాతో పాటు కొత్తగా చేరిన ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాల అధినేతలు, ప్రతినిధులు ఢిల్లీకి చేరుకున్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్డీబీ) అధిపతులు కూడా ఈ సమావేశాల్లో పాలుపంచుకోనున్నారు. అగ్రనేతలకు ఆతిథ్యం ఇస్తున్న హోటళ్లు వారి కోసం ఆహారం, భద్రత, ఇతర సేవల




విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ చర్చల ద్వారా ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు సమష్టి పరిష్కారాలు కనుగొనాలని బ్రిక్స్ కూటమి లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రపంచ సవాళ్లే ప్రధాన అజెండా

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం (ముఖ్యంగా హార్ముజ్ జలసంధి దిగ్బంధనం), అమెరికా వాణిజ్య విధానాల వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈ సదస్సు జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆహార భద్రత, ఇంధన రంగంలో సహకారం, ఆరోగ్యం, విపత్తుల నివారణ, కీలక వస్తువుల సరఫరా వ్యవస్థలలో సమష్టిగా స్థితిస్థాపకతను పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. సంక్లిష్టంగా మారిన ప్రస్తుత ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో బ్రిక్స్ కూటమిని ఒక కీలక శక్తిగా నిలబెట్టాలని భారత్ భావిస్తోంది.

మోదీతో పుతిన్ ద్వైపాక్షిక చర్చలు

ఈ సదస్సులో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. పుతిన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. ఈ భేటీలో రక్షణ, ఇంధనం, సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతం వంటి పలు కీలక అంశాలపై వీరు చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించే మార్గాలపై దృష్టి సారించనున్నారు.

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర..
## మహిళా అధికారుల ముందు
## అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

## బ్రిక్స్ సదస్సు సందర్భంగా
## పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

ఢిల్లీ,: బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పుతిన్‌కు ఒక విశిష్టమైన సాంస్కృతిక కానుకను అందజేశారు. ప్రాచీన తమిళ సాహిత్య గ్రంథమైన 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద ప్రతిని ఆయనకు బహూకరించారు. సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు ఎంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. పరస్పరం కరచాలనం చేసుకుని, ఆలింగనం చేసుకున్నారు. ఈ భేటీలో పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై వారు కూలంకషంగా చర్చించినట్లు సమాచారం.

ఏమిటీ తిరుక్కురళ్?

ప్రధాని మోదీ బహూకరించిన 'తిరుక్కురళ్' తమిళ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్య, గౌరవం పొందిన గ్రంథాల్లో ఒకటి. దీనిని సుప్రసిద్ధ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించారు. ఇందులో నీతి, నైతికత, ప్రేమ, సంపద, పాలన, మానవ ప్రవర్తన వంటి అనేక అంశాలపై 1,330 పద్యాలు ఉన్నాయి. ఈ గ్రంథం అర్థవంతమైన, నైతిక జీవితాన్ని ఎలా గడపాలో తెలియజేసే మార్గదర్శిగా ప్రసిద్ధి చెందింది. ఇందులోని అంశాలు సార్వత్రికమైనవి కావడంతో, భాష, సంస్కృతి, దేశాల సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఇప్పటికే అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించబడిన ఈ గ్రంథం రష్యన్ అనువాదాన్ని పుతిన్‌కు అందించడం ద్వారా, విశ్వమానవ విలువలను చాటిచెప్పే భారతీయ సాహిత్య వారసత్వాన్ని నరేంద్ర మోదీ ఆయనకు పరిచయం చేసినట్టయింది.

## ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ,
## వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

హైదరాబాద్, : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి
## - కలెక్టర్లకు మంత్రి లోకేశ్ ఆదేశం..

మొదటి పేజి తరువాయి



విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండటంతోపాటు, నూతన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను వివిధ పరిశ్రమలతో అనుసంధానిస్తూ, వాటికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు 'నైపుణ్యం' వెబ్ పోర్టల్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలతోపాటు అవసరమైన స్కిల్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, యువత మధ్య సమన్వయం పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు, ఏపీలో అక్షరాస్యత పెంపుతోపాటు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీపైనా విద్యాశాఖ దృష్టి సారించిందని లోకేశ్ తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వీయ రక్షణ చర్యలపైనా పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కరిక్యులమ్ మార్పుపై ఇప్పటికే రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో భవిష్యత్ నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం
## బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత

మొదటి పేజి తరువాయి

ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం..
## రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

మొదటి పేజి తరువాయి

ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..
## ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

మొదటి పేజి తరువాయి



ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..
## మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన



ఢిల్లీ,: ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

# స్మార్ట్ కార్డుల పంపిణీ!

## మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని మండల పార్టీ అధ్యక్షుడు మండల పార్టీ అధ్యక్షులు జి వెంకటరావు అన్నారు. గడిసింగాపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డ్ లను పంపిణీ చేయడం జరిగింది గత వారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి . గడిసింగాపూర్ రైతువేదికలో ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డు లను ఈరోజు మిగిలిన వారికి పరిగి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలవేలు నర్సింలు ఉప సర్పంచ్ మహిపాల్, వార్డు సభ్యులు శ్రీనివాస్,,యాదయ్య, మాజీ సర్పంచ్ మాణిక్యం, మాజీ ఉపసర్పంచ్ సోండేపురం ప్రభు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మొగులయ్య రేషన్ షాప్ డీలర్ మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొని పంపిణీ చేయడం జరిగింది.

# అండర్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన

## - మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గడిసింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న అండర్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన పరిగి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడిసింగాపూర్ వాసి జి. వెంకట్ రాములు పరిశీలించి పనులు నాణ్యతయుతంగా చేయాలని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు, సూచించడం జరిగింది. గ్రామంలోని అన్ని వార్డుల్లో ఎట్టి పరిస్థితుల్లో కచ్చితంగా మొత్తం మురుగు కాలువలను అండర్ డ్రైనేజీగా మార్చాలని లక్ష్యంతో పనిచేయాలని సూచించడం జరిగింది.

# మిషన్ సురక్ష కార్యక్రమాల అమలులో కడప "దిశా"కు రాష్ట్రస్థాయి అవార్డు..!!



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 11 : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ సురక్ష కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసినందుకు కడప దిశాకు రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రశంస అవార్డు లభించింది. రాష్ట్రస్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా చేరుకున్నందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబుకు ఈ అవార్డు లభించింది. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్ అవార్డును అందజేశారు.



కడప జిల్లాలో నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాల ద్వారా మిషన్ సురక్షలో మొదటి 95, మూడవ 95 లక్ష్యాలను సాధించినట్లు అధికారులు తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, అందరి సమష్టి కృషితో సురక్షిత సమాజం దిశగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప ఎయిడ్స్ నియంత్రణ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ రాష్ట్రస్థాయి అవార్డును జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు, ఉమ్మడి కడప -- అన్నమయ్య జిల్లాల సమూహ కార్యక్రమాల నిర్వాహకుడు వేంపల్లి భాస్కర్‌కు అందజేసి అభినందించారు. జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని డాక్టర్ యుగంధర్ సూచించారు. మిషన్ సురక్ష కార్యక్రమాల విజయవంతమైన అమలులో కీలక పాత్ర పోషించిన దిశా సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షకుడు ప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసీ నాయకులకు ఆకస్మిక ఏక్సిడెంట్

## యాక్సిడెంట్స్ కి ప్రధాన కారణం రోడ్డు ప్రక్కనే ఉన్న వైన్ షాపులే

## రోడ్డు పక్కన ఉన్న వైన్ షాపులు తక్షణమే తొలగించాలి.

## ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్.



రంపచోడవరం, సెప్టెంబర్ 12, పోలవరం జిల్లా బ్యూరో.: పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజక వర్గం,రంపచోడవరం ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత మరియు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఇంటికి ఎదురుగా ఉన్న వైన్ షాపు ముందు ఆటో మరియు బైక్ యాక్సిడెండ్ జరిగింది.ఈ యాక్సిడెండ్ లో ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు తెల్లం శేఖర్,యలగాడ నాగేశ్వరరావు,అరగాటి వీరభద్ర రెడ్డి ఉన్నారు.ఈ రోజు అరకు ఎంపీ గుమ్మ తనూజ రాణి ని కలసి దేవీ పట్నం మండల పరిధిలోని ఇందుకూరు గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 281/1 లో విస్తీర్ణం 5 సెంట్లు అధికారికంగా కేటాయించిన ఆదివాసీ భవనం స్థలంలో భవనం నిర్మాణం కోసం ఆర్థిక సహాయం కోసం కలవటానికి వెళు తున్న ఈ సమయంలో బైక్ మరియు ఆటో ఆకస్మాత్తుగా ఏక్సిడెంట్ అయ్యిందని,అలాగే ఇలాంటి యాక్సిడెంట్స్ లో ప్రాణాలు కోల్పోవడం కూడా జరుగుతుందని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఏక్సిడెంట్ లో యలగాడ నాగేశ్వరరావు కి కుడి చేతి భుజానికి,కుడి మోకాలు దగ్గర తీవ్రమైన దెబ్బ తగిలి రక్తం వచ్చేలా నడవలేక పోతున్నాడు.అరగాటి వీరభద్ర రెడ్డి కి కుడి మోకాలు కి తీవ్రమైన రక్తం వచ్చేలా దెబ్బ తగిలింది.ఈ ఏక్సిడెంట్ కి ప్రధాన కారణం తారు రోడ్డు ప్రక్కనే వైన్ షాప్ ఉండటం వలన అక్కడికి వచ్చిన వినియోగదారులు వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయడం జరుగుతుంది.కావున రంపచోడవరం మెయిన్ రోడ్డు ప్రక్కన ఉన్న వైన్ షాప్ ను తొలగించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు.ఏక్సిడెంట్ జరిగిన తరువాత ప్రభుత్వ హాస్పటల్ కి తీసుకువెళ్లి వైద్యం తీసుకోవటం జరిగింది.ఏక్సిడెంట్ అయిన వారికి పరమర్శించటానికి ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడకం వరప్రసాద్ దొర,పి.అర్జునుడు,మూలెం బుచ్చి రాజు, ఆదివాసీ మహా సభ జిల్లా ప్రధాన కార్యదర్శి మడకం బంగారు బాబు,బిజెపి మండల కార్యదర్శి అయినాల శ్రీనువాసు,బి.శ్రీనివాసు,దేవీ పట్నం మండల పరిధిలోని జర్నలిస్టు బి.చక్రి మొదలైన వారు పాల్గొన్నారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం : జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్.

## అటవీ సంపద పరిరక్షణతో పాటు గిరిజనుల హక్కుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అటవీ నేరాల నియంత్రణకు చర్యలు.



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11.: కొత్తగూడెం : విధి నిర్వహణలో అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శు క్రవారం కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్ లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అమరవీరుల సంస్మరణ సభకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎంతోమంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు . అటవీ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది అటవీ సంపద సంరక్షణలో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో అటవీ నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఒక రకమైన నేరాలు అధికంగా ఉండగా, ప్రస్తుతం సైబర్ నేరాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత నేరాలు తదితర కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, అదే విధంగా అటవీ నేరాలను అరికట్టేందుకు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అటవీ శాఖ సిబ్బంది సాంకేతికంగా మరింత సామర్థ్యం పెంచుకోవాలని అన్నారు. శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక పరికరాలు, లైటింగ్, కమ్యూనికేషన్ తదితర సౌకర్యాలతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని తెలిపారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపదను పరిరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని, కష్టపడి పనిచేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతాన్ని కలిగి ఉందని, ఇక్కడి గిరిజన సమాజానికి అడవులతో ఎంతోకాలంగా సన్నిహిత సంబంధం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కోయలు, కొండరెడ్లు తదితర గిరిజన సమాజాలు అడవులతో మమేకమై జీవిస్తున్నారని, అటవీ శాఖ మరియు గిరిజన సమాజాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో ముఖ్యమని అన్నారు. అటవీ సంపదను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు . పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, అటవీ హక్కులు తదితర అంశాలపై అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, గిరిజన సమాజాల భాగస్వామ్యంతో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అడవులను కాపాడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంత ముఖ్యమో, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అటవీ అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో అటవీ సంపదను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, సమాజం అండగా నిలవాలని, వారి త్యాగాలకు తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు,జిల్లా అటవీ అధికారి సిధార్ద్ విక్రమ్ సింగ్ , అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కరువు మండలా లుగా ప్రటించి కరువు సహాయక చర్యలు చెపటాలి....

## రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందారావు



ఏపీ బ్యూరో, పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 11: ఎల్-నీనో ప్రభావంతో గత 3 నెలల నుండి వర్షాలు లేనందున కరువు మండలాలు ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, మున్నేరు-పోలంపల్లి ఆనకట్ట మరమ్మతులకు నిధులు కేటాయించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మల్నీడి



యల్లమందారావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శు క్రవారం రైతు-కౌలు రైతు సంఘాల ఆధ్వర్యాన్న యన్టిఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు మండల తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, మండల తహశీల్దారు కి వినతి పత్రము అందించడం జరిగినది. ఈ సందర్భంగా మల్నీడి యల్లమందారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో అనావృష్టి వలన తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని 53% వర్షపాతం లోటు వలన వేసిన పంటలు సైతం ఎండుముఖం పట్టాయన్నారు. ఈ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వర్షాభావ పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి, రాష్ట్రానికి ప్రత్యేక కరువు ప్యాకేజ్ను ఇవ్వాలన్నారు. కేంద్రం నుండి కరువు పరిశీలనకు కేంద్ర బృందాలను పంపించాలని కోరినారు. వర్షాభావం కారణంగా పంటలు సాగుచేయలేక పోయిన రైతులు-కౌలు రైతుల జీవనోపాధికి సహాయం అందించాలని కోరినారు. రైతులు-కౌలు రైతులకు 2026 నాటికి ఉన్న అన్నిరకాల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేసినారు. కరువు ప్రభావిత మండాలలోని విద్యార్థిని- విద్యార్థులకు అన్ని రకాలు విద్యా ఫీజులు మాఫీలు చేసి, విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా, ప్రత్యేక ఆర్థిక సహాయమును అందించాలని విజ్ఞప్తి చేసినారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి చుండూరు సుబ్బారావు మాట్లాడుతూ వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి, ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమ పరిహారం, పంట రుణాలందించాలన్నారు. సీనియర్ రైతు నాయకులు మాజీ ఎంపిపి పొన్నం నరసింహారావు మాట్లాడుతూ మున్నేరు పోలంపల్లి ఆనకట్ట మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన నిధులు కేటాయించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసినారు. సీనియర్ సీపిఐ నాయకులు రైతు సంఘ నాయకులు వల్లంకొండ బ్రహ్మం మాట్లాడుతూ కరువు నివారణ చర్యలలో భాగంగా బియ్యంతో పాటు 16 రకాల నిత్యావసర వస్తువులను చౌక డిపోల ద్వారా అందించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మండల రైతు నాయకులు కనకపూడి బాబురావు, చల్లాల శివాజీ, గద్దం శ్రీనివాసరావు, వల్లంకొండ భాస్కర్, జక్కులూరి వెంకటేశ్వరరావు, జిల్లేపల్లి చిన్న, వేల్పుల కాంతయ్య, కటారపు కన్నయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మూడు వంశీకృష్ణ..

నర్సంపేట : విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అవినీతి నిర్మూలన, నిజాయితీ, పారదర్శకత మరియు బాధ్యతాయుతమైన పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా నర్సంపేట బ్రాంచ్ మేనేజర్ మూడు వంశీకృష్ణ మాట్లాడుతూ, విజిలెన్స్ అంటే కేవలం అవినీతిని అరికట్టడం మాత్రమే కాకుండా, మన రోజువారీ జీవితంలో నిజాయితీ, పారదర్శకత, బాధ్యత వంటి విలువలను పాటించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, గ్రామపంచాయతీలు లేదా ఇతర సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వ లేదా బ్యాంకింగ్ సేవల కోసం ఎవరూ అక్రమంగా డబ్బు ఇవ్వకూడదని, తీసుకోకూడదని సూచించారు. ఎవరైనా లంచం అడిగితే భయపడకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు వంటి సేవల కోసం మధ్యవర్తులను ఆశ్రయించకుండా అధికారిక మార్గాల ద్వారానే సేవలు పొందాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మనకు తెలిసిన అవినీతి లేదా



అక్రమాలను చూసి మౌనంగా ఉండకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. అలాగే చిన్నప్పటి నుంచే పిల్లలకు నిజాయితీ, నైతిక విలువలను నేర్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

"నేను లంచం ఇవ్వను -- తీసుకోను,
అవినీతిని ప్రోత్సహించను,
నిజాయితీగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాను"
అనే సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు.



అవినీతి నిర్మూలన ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే అవినీతి రహిత సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. నిజాయితీతో కూడిన సమాజమే అభివృద్ధి చెందిన గ్రామానికి పునాది అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఒకేసారి పరిహారం (ఓ టి ఎస్) పొందిన నాన్-ట్రైబల్స్ ఏజెన్సీని వీడకపోవడంపై ఆగ్రహం...

## ఆదివాసి లారా నాన్ ట్రైబల్స్ కి భూములు అమ్మి చరిత్ర ద్రోహులుగా మిగలకండి.

# ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్

చింతూరు సెప్టెంబర్ 12 పోలవరం జిల్లా బ్యూరో : పోలవరం ప్రాజెక్టు ముంపు పరిహారంలో భాగంగా 'వన్ టైమ్ సెటిల్మెంట్' (ఓ టి ఎస్) పద్ధతిలో పరిహారం అందుకున్న గిరిజనేతరులు (నాన్-ట్రైబల్స్) ఏజెన్సీ ప్రాంతాలను వదిలి వెళ్లకుండా, మళ్లీ ఇక్కడే తిష్టవేయడంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చింతూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించి ఏజెన్సీలోనే స్థిరనివాసాలు ఏర్పాటు చేస్తున్న నాన్ ట్రైబల్స్ పై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం ఆర్ ఆర్ ప్యాకేజీ కింద చింతూరు ఏజెన్సీ పరిధిలో ఇప్పటివరకు 500 మందికి పైగా నాన్-ట్రైబల్స్ వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా ప్రభుత్వం నుండి పరిహారం పొందినట్లు తమ దృష్టికి వచ్చిందని కుంజా శ్రీను తెలిపారు. నిబంధనల ప్రకారం పరిహారం అందుకున్న వారు ప్రభుత్వం కేటాయించిన పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లాల్సి ఉండగా, అలా చేయకుండా రాజ్యాంగబద్ధమైన 1/70 చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సొమ్ముతో స్థానిక ఆదివాసులను మభ్యపెట్టి, ముంపు లేని ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమంగా భూములు కొనుగోలు చేస్తూ మళ్లీ ఇక్కడే నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుంటున్నారని ఆరోపించారు.

### అధికారుల తీరుపై విమర్శలు ఁ తక్షణమే ఖాళీ చేయించాలని డిమాండ్.

అధికారులు చేతులకు డబ్బులు ఇచ్చి ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించేలా, భూములను దోచుకునేలా ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ తీరు ఉందని దుయ్యబట్టారు. వన్ టైమ్ సెటిల్మెంట్ కింద పూర్తిస్థాయి పరిహారం పొందిన నాన్-ట్రైబల్స్ అందరినీ అధికారులు తక్షణమే



బలవంతంగానైనా ఏజెన్సీ ప్రాంతం నుంచి ఖాళీ చేయించి పంపివేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

### ఆదివాసీలు మేల్కోవాలి - భూములు అమ్మవద్దు.

ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రధాన మండల కేంద్రాలను ఇప్పటికే ఆక్రమించుకుని, ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్-ట్రైబల్స్ కి ఆదివాసీలు ఎవరూ కూడా తమ భూములను అమ్మవద్దని, అలా అమ్మితే సొంత జాతికే ద్రోహం చేసిన వారవుతారని హితవు పలికారు. కొంతమంది మధ్యవర్తులు (బ్రోకర్లు) బినామీ పేర్లతో భూముల కొనుగోలు ప్రక్రియ సాగిస్తున్నారని విమర్శించారు.

### 1/70 చట్టం మరియు జి.ఓ. ఎం ఎస్. నెంబర్. 3 పై హెచ్చరిక:

గతంలో కొంతమంది ఆదివాసీ ద్రోహులు గిరిజనేతరులకు సహకరించి వారిని ప్రోత్సహించడం వల్లే ఐదో షెడ్యూల్ ప్రాంతాలకు రక్షణగా ఉన్న జి.ఓ. నంబర్ 3 ను కోల్పోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. అంతేకాకుండా, గిరిజన హక్కులకు గుండెకాయ లాంటి 1/70 చట్టాన్ని కూడా రద్దు చేయాలంటూ ఏజెన్సీలోకి అక్రమంగా ప్రవేశించిన గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన ఏజెన్సీ హక్కులు, చట్టాలు అమల్లోకి రావాలంటే నాన్-ట్రైబల్స్ ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందేనని, ఆదివాసీలంతా తక్షణమే మేల్కోవాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో పోలవరం జిల్లా అధ్యక్షుడు కూర చిట్టిబాబు, నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక


# నేడు జాతీయ లోక్ అదాలత్

## రాజీ ద్వారా కేసుల పరిష్కారానికి ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి

అనంతపురం, మహి న్యూస్, సెప్టెంబరు 11: ఈ నెల 12వ తేదీన రెండో శనివారం సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు తెలిపారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల పరిధిలో రాజీ పడదగిన కేసులను గుర్తించి, వాటిని జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కేసుల పరిష్కారంలో ఇరుపక్షాల అంగీకారంతో త్వరితగతిన న్యాయం పొందే అవకాశం ఉన్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతపురం జిల్లాలో సంఖ్యాపరంగా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా న్యాయశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు. రాజీ పడదగిన కేసులు ఉన్న కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు.

# జాతీయ స్థాయిలో ఆదివాసీల సమస్యలపై ఉమ్మడిగా పోరాడుదాం:మొట్టడం రాజబాబు




రంపచోడవరం సెప్టెంబర్ 12 పోలవరం జిల్లా బ్యూరో.: జాతీయ స్థాయిలో ఆదివాసీల సమస్యలపై ఉమ్మడిగా పోరాడుదామని భారత్ ఆదివాసీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. మధ్యప్రదేశ్, రత్లాంలో భారత్ ఆదివాసీ పార్టీ తృతీయ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న మొట్టడం రాజబాబు మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలలో ఆదివాసీల సమస్యలు ఒకేలాగా ఉన్నాయని,వాటిని ఉమ్మడిగా పరిష్కారించుకొందామని,ప్రజాస్వామ్యంలో రాజకీయాలే అత్యున్నతమైనవని,వాటి ద్వారా ప్రజాస్వామ్య యుతంగా సమస్యలు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని,అందుకు వేదిక భారత్ ఆధివాసి పార్టీ అని, రాజస్థాన్ నుండి భారత్ ఆదివాసి పార్టీ తరుపున ఎంపీగా ఎన్నికైనా రాజ్ కుమార్ రోత్ పార్లమెంట్లో భారత దేశంలో ఉన్న ఆదివాసీలందరి పక్షాన గళమెత్తడం విశేషం,సంతోషకరమని,ఆయనకి అండగా మిగతా ఆదివాసి ఎంపీలు ఉండాలి, కానీ దురదృష్టం మిగతా ఎంపీలు ఆదివాసీ ప్రజల పక్షాన కాకుండా వాళ్ళ పార్టీల ఏజెండాలతోనే మాట్లాడటం చూస్తున్నమని,రాజస్థాన్లో భారత్ ఆధివాసి పార్టీ నుండి నలుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో థర్డ్ ఫ్రంట్ గా ఉండటం గర్వకారణం.వారు రాజస్థాన్ అసెంబ్లీలో ఆదివాసులు పక్షాన మాట్లాడటం గర్వాంగా ఉందని,మధ్యప్రదేశ్లో 25 మంది ఆదివాసి ఎమ్మెల్యేలు ఉంటే ఆదివాసులు పక్షాన భారత్ ఆదివాసి పార్టీ ఎమ్మెల్యే ఒకరు అసెంబ్లీ వేదికగా మాట్లాడడం చూస్తున్నాం. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణాలో ఒకరిద్దరి ఎమ్మెల్యేలు మాత్రమే ఆదివాసీల పక్షాన మాట్లాడుతున్నారు.ఆంధ్రప్రదేశ్ లో అయితే ఆదివాసులు పక్షాన మాట్లాడడానికే ఆదివాసి ఎమ్మెల్యేలు మొగ్గుచూపకపోవడం దురదృష్టకరమని, రాజకీయాలు ఈ విధంగా ఉండకూడదని,భవిష్యత్తులో రాజకీయాలు మారాలని,మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ఆదివాసి సమాజానిదని,ఆదివాసీలు తమ రాజకీయాలు తామే చేసుకోవాలని,ఆ పని భారత్ ఆదివాసి పార్టీ చేస్తుందని, మిగతా రాజకీయ పార్టీలలో ఉన్న ఎమ్మెల్యేలు,ఎంపీలు వారి అధినేతల కనుసన్నల్లో నడుస్తున్నారని, ఈ విధంగా ఉంటే స్వతంత్రం వచ్చి 80 ఏళ్ల కాదు మరో వందేళ్లయినా ఆదివాసీ సమాజంలో మార్పు రాదని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారత్ ఆదివాసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుండి భారత్ అధివాసి పార్టీ రాష్ట్ర కోశాధికారి మర్రిచెట్టు పోతురాజు, ఏలూరు జిల్లా అధ్యక్షులు తెల్లం రవి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సరియం కన్నప్పరాజు,మడకం వెంకటేష్,బంగారు వెంకటేష్ తెలంగాణ నుండి ఉమ్మల దుర్గారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# కోళ్లపాడు గ్రామంలో దోమతెరల పంపిణీ



కూనవరం సెప్టెంబర్ 12 పోలవరం జిల్లా బ్యూరో : కూనవరం మండలం, కూనవరం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని వెంకటయాపాలెం సచివాలయం పరిధిలోని కోళ్లపాడు గ్రామంలో శుక్రవారం దోమతెరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారిని, చింతూరు ప్రాజెక్ట్ ఆఫీసర్, మలేరియా అధికారి, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ., కూనవరం మండల కమిటీ సభ్యులు మరియు కూనవరం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ చేతన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కూనవరం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ చేతన్ కుమార్ మాట్లాడుతూ, మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణలో భాగంగా క్రిమిసంహారక దోమతెరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ దోమతెరలను విధిగా వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. తమ గ్రామానికి దోమతెరలు పంపిణీ చేసినందుకు జిల్లా అధికారులకు, కూనవరం మండల అధికారులకు, ఆసుపత్రి వైద్యాధికారికి మరియు వైద్య సిబ్బందికి కుళ్లపాడు గ్రామస్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ. ఏ. ఆశీర్వాదం, సెక్రటరీ, స్థానిక మాజీ సర్పంచ్ సొందే ముత్తమ్మ, హెల్త్ సూపర్వైజర్ డి. శ్రీనివాస్, స్థానిక యూత్ లీడర్ గిగా రామారావు, గ్రామ పెద్దలు మడకం బాలరాజు, మడకం రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ టి. రామకృష్ణ, ఎ.ఎన్.ఎం. పి. నాగమణి, ఆశా కార్యకర్తలు జి. జయలక్ష్మి, ఎస్. చిన్నమ్మి, ఎస్. లక్ష్మి, హైమావతి, యేసుమని, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్‌లో షార్ట్ సర్క్యూట్ కలకలం

## - తప్పిన పెను ప్రమాదం!



ఇల్లెందు ,ఆర్ సి న్యూస్ సెప్టెంబర్ 11: ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం భారీ ప్రమాదం తప్పింది. బస్టాండ్ ఆవరణలోని కంట్రోలర్ గదిలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సమయంలో ఈ ఘటన జరగగా, గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే గదిలో ఉన్న పలు రికార్డులు, ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చారు. అసలు సమస్య ఇదే కాదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లెందు బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరిందని, గతంలో కూడా స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయని, కరెంట్ వైర్లు ఎప్పుడో పాతబడిపోయాయని వాపోతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు వచ్చే బస్టాండ్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పాత బస్టాండ్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి, విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించి ప్రయాణికులకు భద్రత కల్పించాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# అనంతపురం క్రీడా నమూనాపై చంద్రబాబు ప్రశంసలు

## రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం.. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా బలమైన క్రీడా వ్యవస్థకు కార్యాచరణ



అనంతపురం, మహి న్యూస్, సెప్టెంబరు 11: గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు అనంతపురం జిల్లా యంత్రాంగం రూపొందించిన పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. అనంతపురం క్రీడా నమూనాను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన 8వ కలెక్టర్ల సదస్సు రెండో రోజు సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పాల్గొని జిల్లాలో అమలు చేస్తున్న పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ విధానాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలోని విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. గతంలో పాఠశాల క్రీడల సమాఖ్య ద్వారా నిర్వహించిన ఎంపిక పోటీల్లో సుమారు 1,600 మంది మాత్రమే పాల్గొనగా, కొత్త విధానంలో జిల్లాలోని 544 పాఠశాలల నుంచి ఏకంగా 25,048 మంది విద్యార్థులు పాల్గొన్నారని కలెక్టర్ తెలిపారు. ఇందులో 45 శాతం మంది బాలికలు ఉన్నారని చెప్పారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, జూడో వంటి ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు వివరించారు. అదనపు ఆర్థిక భారం లేకుండా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పోటీలను నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల రవాణాకు బాలికలకు స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, బాలురకు పాస్‌లను వినియోగించినట్లు చెప్పారు. క్రీడా మైదానాల అభివృద్ధికి జీరామ్‌జీ సహకారం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి పాఠశాల విద్యాశాఖ సహకారం అందించినట్లు వివరించారు. క్రీడా ఉపాధ్యాయులు, క్రీడల శాఖ కోచ్‌లు, అనంతపురం ఆర్డీటీ క్రీడా ప్రాంగణాలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల సహకారంతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా పతకాలు, షీల్డులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రూ.20 లక్షల వ్యయంతో నిర్వహించినట్లు కలెక్టర్ వివరించారు.

### 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా బలమైన క్రీడా వ్యవస్థ

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా కలెక్టర్ వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా క్రీడా నైపుణ్యాలను చిన్న వయస్సులోనే గుర్తించి ప్రోత్సహించే అవకాశం ఏర్పడిందన్నారు. విద్యార్థులను అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక విధానాన్ని రూపొందించడాన్ని అభినందించారు. జిల్లా స్థాయిలో క్రీడా పాఠశాలల ఏర్పాటుపై పరిశీలన చేయాలని సూచించారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో బలమైన క్రీడా వ్యవస్థను నిర్మించాలని విద్యాశాఖ మంత్రి, క్రీడా ప్రాధికార సంస్థ అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్రీడా ప్రతిభను చిన్న వయస్సులోనే గుర్తించడం, వివిధ పోటీల నిర్వహణ, క్రీడాకారుల నైపుణ్యాల అంచనా, నిరంతర శిక్షణ వంటి అంశాలతో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా, పాఠశాల విద్యాశాఖ, క్రీడా ప్రాధికార సంస్థ నిధులతో పాటు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను సమన్వయం చేసి ఈ కార్యక్రమాన్ని శాశ్వత ప్రాతిపదికన కొనసాగించాలని సూచించారు. బాలురు, బాలికలకు ప్రత్యేక వసతి సౌకర్యాలతో కూడిన క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయడంతో పాటు అమరావతి, విశాఖపట్నం, తిరుపతిని ప్రధాన క్రీడా కేంద్రాలుగా అభివృద్ధి చేసి, అన్ని జిల్లాలను అనుసంధానించే 'కేంద్రం--అనుబంధ కేంద్రం' విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# రంపచోవరంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం?

రంపచోవరం సెప్టెంబర్ 12 పోలవరం జిల్లా బ్యూరో.: రంపచోడవరం స్థానిక భాను ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడు, ఎస్.ఐ.ఆర్ టాస్క్ ఫోర్స్ వామిశెట్టి పరమేశ్వరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశ ప్రారంభంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, కర్రి పాపారాయుడుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో, ప్రతీ వార్డులో పార్టీని బలోపేతం చేసి వైయస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు.

**ఈ ఎన్నికల్లో ప్రధానంగా రెండు సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ధనలక్ష్మి పేర్కొన్నారు:**

**తెలుగుదేశం పార్టీ చేసే రాజకీయ కుయుక్తులు మరియు ప్రలోభాలు.**

**పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని నాయకులు, కార్యకర్తలపై చేసే ఒత్తిళ్లు.**

అవసరమైతే న్యాయపరంగా కూడా పోరాడి వీటిని ధైర్యంగా తిప్పికొడతామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన' పోస్టర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల వైయస్సార్‌సీపీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ హోదాల్లోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టేకులపల్లి శ్రీ కోదండ రామాలయంలో ఘనంగా ఎస్సై కుమార్తె అన్నప్రాసన వేడుక...

టేకులపల్లి న్యూస్ సెప్టెంబర్ 11: టేకులపల్లి మండలం గోలియా తండా గ్రామపంచాయతీలోని శ్రీ శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో అన్నప్రాసన వేడుక ఘనంగా జరిగింది. టేకులపల్లి ఎస్సై కె . తిరుపతి కుమార్తె కె.ఖుషి అన్నప్రాసన మహోత్సవాన్ని కుటుంబ సమేతంగా ఆలయంలో నిర్వహించారు. ఆలయ పురోహితులు విజయ్ సాయి చక్రి వేద మంత్రోచ్ఛారణలతో, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారి ఖుషి కి తొలిసారిగా అన్నం తినిపించే ఈ వేడుకను హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రంగా భావిస్తారు. బిడ్డకు ఆయురారోగ్యాలు, జ్ఞానం, సుఖసంతోషాలు కలగాలని, శ్రీ రామచంద్రుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని పురోహితులు వేద ఆశీర్వచనం చేశారు . అనంతరం కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

# "జయప్రద ఫౌండేషన్ మెగా జాబ్ మేళా "

ఏపీ బ్యూరో, జగ్గయ్యపేట సెప్టెంబర్ 11 : జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో విద్యా వైద్య రంగాలలో అందించుచున్న సేవలతో పాటు యువతకు వారి భవిష్యత్తుకు మంచి అవకాశాలను కల్పించాలనే సంకల్పంతో వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలనే ఉద్దేశంతో ది.13 సెప్టెంబర్2026న ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 10వ తరగతి నుండి ఐటిఐ, ఇంటర్,డిగ్రీ,పీజీ, డిప్లమో, ఇంజనీరింగ్, చదివిన యువతకు, శుభమస్తు కళ్యాణ మండపం జగ్గయ్యపేట పట్టణం చిల్లకల్లు రోడ్డులో, ప్రముఖ టి సి ఎస్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, టీవీఎస్, అపోలో టైర్స్, అమరన్ బ్యాటరీస్, తులసి సీడ్స్, వంటి 20 ప్రముఖ కంపెనీల నుండి వచ్చు ఐటి, నాన్ ఐటి, ఉద్యోగ అవకాశాలను యువత ఉపయోగించుకొన వలసినదిగా కోరుచున్నాను. అదేరోజు సెలెక్ట్ అయిన వారందరకు అపాయింట్మెంట్ ఆర్డర్ కూడా ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన గలరని జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# ప్రజా సమస్యల పై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ వారికి ఫిర్యాదు చేసిన బిజెపి.పార్టీ రాష్ట్ర మైనారిటీ నాయకులు బిజెపి. సైదా

ఎన్టీఆర్. జిల్ల బ్యూరో : సెప్టెంబర్ 11 : నందిగామ ; ఎన్టీఆర్ జిల్ల నందిగామ లో శుక్రవారం రోజున ఆర్.ఎస్. గార్డెన్ లో నందిగామ మండల పరిధి లో ఏర్పాటుచేసిన స్నేహ పూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో పలు ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ ఎన్టీఆర్ జిల్ల నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మరియు జాయింట్ కలెక్టర్ ఇలక్కియ వారి సమక్షం లో అర్జీ అందజేసిన బిజెపి.పార్టీ మైనారిటీ రాష్ట్ర నాయకులు బిజెపి. సైదా.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## సెప్టెంబర్ 15న హైదరాబాదులో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి.

టేకులపల్లి, సెప్టెంబర్ 11: హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి,ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం టేకులపల్లి మండలం తుమ్మల చెలక గోదాము, మురుట్ల గ్రామంలో సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు, గోదాములు,రైస్ మిల్లులు,సిమెంటు, ఎరువుల గోదాములు, పరిశ్రమలు,ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే వేలాది మంది హమాలీ కార్మికులు నేటికీ చట్టబద్ధమైన హక్కులు,రక్షణ లేకుండా పనిచేస్తున్నారని అన్నారు.హమాలీలు నిత్యం బరువులు మోయడం వల్ల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం హమాలీలకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,చట్టబద్ధమైన హక్కులు,సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,50 సంవత్సరాల వయసు దాటిన హమాలీలకు నెలకు 10వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని,ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి మేకల వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు తోడేటి నాగేశ్వరరావు, నాయకులు డి.మోహన్ రావు,మహేష్,సురేష్,శ్రీరా ములు,బన్ని,రవి,బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల లో మహిళల కు ఉచిత శిక్షణ కు దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్. జిల్ల బ్యూరో సెప్టెంబర్ 11: నందిగామ ; ఎన్ఎన్టీఆజిల్ల నందిగామ లో నిరుద్యోగ యువతి (మహిళలకు) ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ నందిగామ నందు 10 వ, 12 వ తరగతి మరియు డిగ్రీ అభ్యసించిన అభ్యర్థులకు ప్రత్యేకంగా 2 నెలలు పాటు డేటా ఎంట్రీ కోర్సు నందు ఉచిత శిక్షణ కొరకు తేదీ 30-09-2026 లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కోర్సులకు ఎంపికైన యువతి (మహిళలకు) కుట్టు యంత్ర ఆపరేటర్ మరియు డేటా ఎంట్రీ కోర్సులలో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాస్ మరియు గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం. రమేష్ బాబు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు మరియు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కావున ఈ శిక్షణకు అర్హత గల 18 నుండి 45 సంవత్సరాల నిరుద్యోగ యువతి (మహిళలు) తేదీ 30-09-2025 లోపు నమోదు చేసుకోవాల్సిందిగా మరియు కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు (చీూణజ ద వీూఖవ్ ద ూూూణజ) ద్వారా ధృవపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా అభ్యర్థులు తమ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ తో గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ నందిగామ నందు ఉదయం 10:00 గంటలకు పూర్తి వివరాలు 8919951682 నంబరులో సంప్రదించాలని గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం. రమేష్ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాస్ తెలిపారు.

# ప్రజల గడపకు పాలన.. సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం!

## నందిగామ లో ప్రత్యేక స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

## అధికార యంత్రాంగం తో కలిసి ప్రజల సమస్యలను విన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 11 : నందిగామ : ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. నందిగామ పట్టణంలోని మధిర ఆర్చి రోడ్డులో ఉన్న ఆర్ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రత్యేక స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (Special People Friendly Public Grievance Redressal System–PGRS) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ , జిల్లా అధికార యంత్రాంగం, కూటమి నేతలతో కలిసి ప్రజల నుంచి సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రజా వేదికలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత "ప్రజల వద్దకే పాలన.. ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం" అనే విధానంతో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికార యంత్రాంగంతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సౌమ్య సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తంగిరాల సౌమ్య తెలిపారు.

# నందిగామ లో ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

## ఐదు రోజుల పని దినాలను తక్షణమే అమలు చేయాలని బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 11: నందిగామ ; ఐదు రోజుల పని దినములను తక్షణమే అమలు చేయాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ వారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్ల నందిగామ పట్టణం లో శుక్రవారం రోజున అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మె చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్ అయిన ఐదు రోజుల పని దినములను తక్షణమే అమలు చేయనట్లయితే ఈ నెల 28, 29,30 తేదీల్లో వరుసగా మూడు రోజులు విధుల బహిష్కరణ జరుగుతుందని వారు హెచ్చరించారు . ఈ కార్యక్రమం లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ మెయిన్ బ్రాంచ్,టౌన్ బ్రాంచ్, చిల్లకల్లు,జగ్గయ్యపేట, జగ్గయ్యపేట కోదాడ రోడ్, కంచికచర్ల కు చెందిన బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపద లో అండగా.. ప్రజలకు భరోసాగా కూటమి ప్రభుత్వం..

## సీఎం. సహాయనిధి ద్వారా 106 మంది లబ్ధిదారులకు రూ.64.19 లక్షల ఆర్థిక సాయం..

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 11: నందిగామ : సీఎం సహాయనిధి అంటే కేవలం ఆర్థిక సహాయం కాదని.. ఆపదలో ఉన్న కుటుంబానికి కూటమి ప్రభుత్వం అందించే భరోసా అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం, వారి కన్నీళు తుడవడం, సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.నందిగామ పట్టణం పాత బస్టాండ్ సెంటర్ లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ నందు శుక్రవారం కూటమి నేతలతో కలిసి సీఎం. సహాయనిధి కింద మంజూరైన రూ.64,19,305 విలువైన చెక్కులను 106 మంది లబ్ధిదారులకు తంగిరాల సౌమ్య నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని సౌమ్య తెలిపారు. అనారోగ్యం, వైద్య ఖర్చులు వంటి అనుకోని పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. "ప్రజల కష్టాలను తెలుసుకుని.. వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తాం" అని తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. నందిగామ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తన వంతు సహకారం అందిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. సీఎం సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక


# అవి నిరాధార ఆరోపణలు

గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 11 : ఏజెంట్ తో వెళితేనే పనులు అనే ఆరోపణలు నిరాధారమని ఉప రవాణా కమిషనర్ కె.సీతారామి రెడ్డి అన్నారు. "ఏజెంట్ తో వెళితేనే పనులు" శీర్షికన ఒక పత్రికలో శుక్రవారం ప్రచురితమైన వార్తపై ఉప రవాణా కమిషనర్ స్పందిస్తూ మంగళగిరి యూనిట్ కార్యాలయాన్ని సందర్శించి, ఎల్.ఎల్.ఆర్, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ దరఖాస్తుదారులను విచారించడం జరిగిందన్నారు. తనిఖీల్లో ఎక్కడా లోపాలు కనిపించలేదని చెప్పారు. ఆరోపణలన్నీ నిరాధారమైనవని, ఇదే వార్త రెండు సంవత్సరాల క్రితం సోషల్ మీడియాలో కూడా ప్రచారం చేయడం జరిగిందని వివరించారు. పాత వార్తను చట్ట విరుద్ధమైన ప్రయోజనాల కోసం మరల ప్రచురించినట్లుగా భావిస్తున్నామని చెప్పారు. మంగళగిరి యూనిట్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలు అందించడం పట్ల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడం జరిగిందని వివరణ ఇచ్చారు.

# ఇంటి పెరట్లోనే ఆకుకూరలు, కూరగాయల సాగు



నల్లజర్ల,మహి న్యూస్ సెప్టెంబర్ 11: స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల మండలం వెస్ట్ చోడవరం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు ఇంటి పెరటి తోటల ద్వారా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసుకునేలా అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఇంటి వద్దే పలు



రకాల ఆకుకూరలు, కూరగాయలు పండించుకుని, వాటిని వినియోగించడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దల ప్రోత్సాహంతో, దాతల సహకారంతో సేకరించిన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ప్యాకింగ్ చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, నాయకుల చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు విత్తన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇంటి పెరట్లో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు సాగు చేయడం వల్ల తాజా, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి వెస్ట్ చోడవరం మాజీ సర్పంచ్ పెండ్యాల చందు, ఆలపాటి చిన్నా రాము, ముసుళ్లకుంటకు చెందిన పాకాలపాటి వెంకటేశ్వరరావు, నందమూరి శారదాదేవి, వెల్లి సుబ్బారావు, అయినపూడి రత్నకుమార్, బలుసు గంగరాజు, కంద్రేకుల అంజనేయులు తదితరులు సహకరించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ఎన్ఎఫ్ఏ సతీష్, డివిజన్ ఎంటీ శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన శ్రేణులు సిద్ధం కావాలి.బొలిశెట్టి శ్రీనివాస్

## యుద్ధానికి సిద్ధం అంటున్న..జనసేన సైనికులు...





ముమ్మిడివరం, (మహీ న్యూస్ )అక్టోబరు 11: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, జనసేన అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ స్థానిక సంస్థల కో-ఆర్డినేటర్ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జనసేన నాయకుడు గోదశి పుండరీష్ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాబలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎక్కడ పార్టీ బలంగా ఉంది, ఎన్ని వార్డుల్లో పోటీ చేయగలం, బలమైన అభ్యర్థులు ఎవరనే అంశాలపై నివేదిక రూపొందించి ఈ నెల 15న పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు



అందజేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో కార్యకర్తలను ఉపయోగించుకుని, ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే ఆవేదన పలువురు కార్యకర్తల్లో ఉందన్నారు. పదవులు, గుర్తింపు విషయంలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి కార్యకర్తల సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన బలంగా ఉన్న చోట ఆ పార్టీ, టీడీపీ బలంగా ఉన్న చోట టీడీపీ, బీజేపీ బలంగా ఉన్న చోట బీజేపీ పోటీ చేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. పాత విభేదాలను పక్కన పెట్టి కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కలిసి పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడం సులభమవుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్రస్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామని, లోక్‌సభ, అసెంబ్లీ స్థాయిలో మూడు పార్టీల ప్రతినిధులతో సమన్వయ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. బలమైన అభ్యర్థుల వివరాలను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన కార్యకర్తలకు పదవులు దక్కేలా కృషి చేస్తామని చెప్పారు. అధికారం ప్రజల కోసం ఉపయోగించాలన్నదే పవన్ కళ్యాణ్ సిద్ధాంతమని, ఆ లక్ష్యంతోనే జనసేన పనిచేస్తోందన్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో జనసేన నాయకులు బండారు శ్రీనివాస్, దూడల స్వామి నాయుడు, కర్రా దుర్గాప్రసాద్, గుద్దటి జమ్మి, ఓగూరి భాగ్యశ్రీ, ముత్యాల జయలక్ష్మి, గిడ్డి రత్నశ్రీ, రంబాల రమేష్, నూకల దుర్గ, అత్తిలి బాబూరావు, గాలిదేవర బుల్లి తదితరులు ఇతర మండల స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్ధేశ్వర కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలి

## ఆలూరులో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా.

ఆలూరు సెప్టెంబర్ 11, : ఆలూరు పట్టణంలో సిద్ధేశ్వర కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, కాలనీలో జరుగుతున్న అక్రమ కలెక్షన్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్రమ కలెక్షన్ల కారణంగా కాలనీలో సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఎస్ఎస్ భాష. సిపిఐ జిల్లా సమితి సభ్యులు. కె. భూపేష్ మాట్లాడుతూ.. సిద్ధేశ్వర కాలనీ ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి సరఫరాలో ఇబ్బందులకు కారణమవుతున్న అక్రమ కలెక్షన్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. సిద్ధేశ్వర కాలనీలో ఇంటింటికి నీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు ఈ ఓ ఆర్ డి సార్ గారికి సమస్యలతో కూడిన మెమోరాండాన్ని సమర్పించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు రామాంజనేయులు సిపిఐ మండల సహాయ కార్యదర్శి కాంత్ రెడ్డి ఏఐటీయూసీ నాయకులు శివ. చేపల గోపాల్. రాజు.మహేష్ ఉల్లిగప్ప తులసమ్మ గౌరమ్మ ప్రభావతి శశికళ ముంతాజ్ షాహిదా లక్ష్మి సిద్ధేశ్వర కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మరింత ముందుకు సాగాలి

## గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 11, 2026: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తన ఐదు దశాబ్దాల ఘనమైన ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, భవిష్యత్తులో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు,





సాంకేతికత ఆధారిత విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక పరివర్తన రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులాధిపతి శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, ఐదు దశాబ్దాలుగా ఉన్నత విద్య, పరిశోధన, సామాజిక అభివృద్ధి రంగాల్లో విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్న సందర్భంగా వైస్-చాన్సలర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఐదు దశాబ్దాల ప్రస్థానం

1967లో నల్లపాడులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేట్ సెంటర్‌గా ప్రారంభమైన సంస్థ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 1976లో సంపూర్ణ విశ్వవిద్యాలయంగా



రూపుదిద్దుకుందని గవర్నర్ తెలిపారు. 1976 సెప్టెంబర్ 11న అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయం అధికారికంగా ప్రారంభమైందన్నారు. కేవలం 10 విభాగాలు, 600 మంది విద్యార్థులతో ప్రారంభమైన విశ్వవిద్యాలయం నేడు 6,000 మంది విద్యార్థులు, 100 మంది పరిశోధక విద్యార్థులతో విస్తరించడం దాని విశేష ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు.

### ఆచార్య నాగార్జున వారసత్వానికి ప్రతీకగా

మహోన్నత బౌద్ధ తత్వవేత్త, పండితుడు ఆచార్య నాగార్జున గారి గౌరవార్థం 2004లో విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిన విషయాన్ని గవర్నర్ ప్రస్తావించారు. ఆచార్య నాగార్జున భారతీయ తత్వచింతనకు, ముఖ్యంగా మాధ్యమక తత్వశాస్త్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయనకు తగిన నివాళిగా విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ బౌద్ధిస్ట్ స్టడీస్' ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

### ఎన్ఏఏసి+తో విశిష్ట గుర్తింపు




విద్యా ప్రమాణాలు, పరిశోధన మరియు సంస్థాగత పనితీరులో విశ్వవిద్యాలయం సాధించిన గుర్తింపులను గవర్నర్ ప్రశంసించారు. 2024లో ఎన్ఏఏసి+గ్రేడ్‌ను 4.00కి 3.46 సిజిపిఏతో సాధించిందని తెలిపారు. అలాగే QS Asia Rankings 2026లో 761--770 బ్యాండ్‌లో స్థానం సంపాదించి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన విశ్వవిద్యాలయంగా నిలిచిందన్నారు. NIRF Rankings 2025లోOverall Categoryలో 101--150 బ్యాండ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల్లో రెండవ స్థానాన్ని సాధించడం విశ్వవిద్యాలయ విద్యా ప్రగతికి ప్రతిబింబమని పేర్కొన్నారు.

### "బోధన, పరిశోధన విశ్వవిద్యాలయానికి రెండు కళ్ల వంటివి"

బోధన మరియు పరిశోధన ఏ విశ్వవిద్యాలయానికైనా రెండు కళ్ల వంటివని గవర్నర్ అన్నారు. సమకాలీన సవాళ్లను పరిష్కరించేలా ప్రాథమిక, అనువర్తిత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణాత్మక దృక్పథం, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు, విద్యను వాస్తవ ప్రపంచ అవసరాలతో అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు.

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్య

ఐదు దశాబ్దాల వారసత్వాన్ని కలిగిన విశ్వవిద్యాలయం సమాజంలోని వివిధ వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్యను మరింత విస్తృతంగా అందించేందుకు కృషి చేయాలని గవర్నర్ అన్నారు. స్వర్ణోత్సవం గత విజయాలను జరుపుకునే సందర్భం మాత్రమే కాదని, భవిష్యత్తు పట్ల విశ్వవిద్యాలయం తన నిబద్ధతను పునరుద్ఘాటించుకునే అవకాశమని పేర్కొన్నారు. ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి పరిశోధన, పారిశ్రామికవేత్తల అభివృద్ధి, సాంకేతికత ఆధారిత విద్య, నైపుణ్యాభివృద్ధి, సామాజిక పరివర్తన వంటి రంగాలకు రాబోయే కాలంలో మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

### ప్రముఖులను తీర్చిదిద్దిన విశ్వవిద్యాలయం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనేక మంది ప్రముఖులను దేశానికి అందించిందని గవర్నర్ పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ఎన్.వి. రమణ, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు, మంత్రులు, IAS, IPS అధికారులు, సాయుధ దళాల అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల వైస్-చాన్సలర్లు, శాస్త్రవేత్తలు, కార్పొరేట్ రంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు తదితరులు విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులుగా ఉన్నారని తెలిపారు.

### స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ 2047కు విశ్వవిద్యాలయం సహకారం

గొప్ప విద్యా వారసత్వం, విస్తరిస్తున్న పరిశోధనా సామర్థ్యం, అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది మరియు సమ్మిళిత, నాణ్యమైన విద్య పట్ల నిబద్ధతతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. జ్ఞాన ఆధారిత,



సమ్మిళిత, ప్రగతిశీల సమాజ నిర్మాణంతో పాటు స్వర్ణాంధ్ర మరియు వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనలో విశ్వవిద్యాలయం తన వంతు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. స్వర్ణోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. జై హింద్!

# రూ.1,272 కోట్లతో ఆరోగ్య వసతుల బలోపేతం




## రూ.249.50 కోట్లతో 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులు రేపు నడ్డా, చంద్రబాబు చేతుల మీదుగా శ్రీకారం

## సెప్టెంబరు 17 నుంచి నెల రోజుల 'సేవా సంకల్ప్ అభియాన్'

## రాష్ట్ర మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ వెల్లడి

గుంటూరు మహి న్యూస్ సెప్టెంబర్ 11: రాష్ట్రంలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు రూ.1,272 కోట్లతో చేపట్టిన ఆరోగ్య వసతుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం గుంటూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభిస్తారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో మెరుగైన వైద్యం అందించడంతోపాటు, వ్యాధులను తొలిదశలోనే గుర్తించేందుకు రూ.249.50 కోట్లతో పూర్తి చేసిన 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను శనివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.234.50 కోట్లతో 10 అత్యవసర చికిత్స కేంద్రాలు, రూ.15 కోట్లతో 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 24 అత్యవసర చికిత్స కేంద్రాలు నిర్మిస్తున్నామని, ఇప్పటికే 10 పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. సెప్టెంబరు నెలాఖరుకు మరో మూడు పూర్తి చేసి, మార్చి నాటికి మొత్తం 24 కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

### డిసెంబరులో 'సంజీవని'

డిసెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులను అనుసంధానం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సమగ్రంగా అందేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 2,800 ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తొలి మూడేళ్లలో కేంద్ర పథకం కింద రూ.28.80 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.250 కోట్లకు పైగా బకాయిలు చెల్లించి పనులను వేగవంతం చేసిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విష్ణువర్ధన్, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుందరా చారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు భాజపా జాతీయ నేత, దక్షిణాది రాష్ట్రాల అభియాన్ ఇన్‌చార్జి, మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రజలకు కృతజ్ఞతలు చెప్పడం, వారి సమస్యలు, సూచనలు తెలుసుకోవడం, భవిష్యత్తు సేవకు ఆశీర్వాదం కోరడమే లక్ష్యమన్నారు. స్వర్ణాంధ్ర--2047, వికసిత భారత్‌లో ప్రజలను భాగస్వాములను చేయడమే ధ్యేయమన్నారు. సెప్టెంబరు 17న 'ఆశీర్వాద దీపం'లితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. రక్తదానం, ఆరోగ్యం, పరిశుభ్రత, సైబర్ మోసాలపై అవగాహన, అవయవదాన ప్రచారం తదితర 25 రకాల సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి కార్యకర్త రోజూ 25 నిమిషాలు సేవకు కేటాయించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానాలు నిర్వహిస్తామని చెప్పారు. 'సేవా గాథ', 'సేవా జ్యోతి', 'వికసిత భారత్ యాత్ర' ద్వారా యువతను, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో అభియాన్ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను జాతీయ నాయకత్వం తనకు అప్పగించిందని మంత్రి తెలిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
తిరుపతి-చిత్తూరు
శనివారం - 12 - సెప్టెంబర్ - 2026

## రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్-వాష్ అండ్ గో'

### అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న కర్నూలు పోలీసులు



కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కర్నూలు జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి నుంచి




తెల్లవారుజాము వరకు జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల డ్రైవర్లకు 'స్టాప్--వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, కర్నూలు సబ్‌డివిజన్ల పరిధిలోని జాతీయ రహదారులపై పోలీసులు లారీలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, కార్లు, మినీ వ్యాన్లు,




లగేజీ బొలేరో తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు నీటితో ముఖం కడిగించి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం ప్రయాణాన్ని కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర భద్రతా ప్రమాణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. రాత్రి వేళల్లో నిద్రమత్తు కారణంగా ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వాహనాలను అతివేగంగా నడపకూడదని, రాంగ్‌రూట్‌లో ప్రయాణించకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని పోలీసు అధికారులు డ్రైవర్లకు సూచిస్తున్నారు. ప్రయాణికులు, వాహన డ్రైవర్ల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

## వినాయకుడి మండపాల్లో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఇవ్వొద్దు

### గ్రామీణ ప్రాంతాల్లో 3, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు మండపాలకు ఉచిత విద్యుత్

### ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి వెల్లడి



తిరుపతి, మహి న్యూస్ సెప్టెంబర్ 11 : వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసుకునే మండపాల్లో విద్యుత్ ప్రమాదాలకు చోటివ్వొద్దని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయకుడి మండపాల్లో విద్యుత్ అలంకరణలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు నిర్ణీత దూరంలో ఏర్పాటు చేయాలని, మండపాల మీదుగా విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ దీపాలతో అలంకరణ కోసం నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడాలని సూచించారు. అలంకరణ పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని సూచించారు. అధిక వాటేజ్ కలిగిన విద్యుత్ దీపాలను వినియోగించే సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగుతోపాటు నాణ్యతతో కూడిన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్ల వరకు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు లోడ్ కలిగి ఉన్న వినాయకుడి మండపాలకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తామని తెలిపారు. ఆపైన లోడ్ కలిగి ఉన్న మండప నిర్వాహకులు నిబంధనల మేరకు రుసుమును చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. వినాయక మండపాలకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం నిర్వాహకులు తమ సమీపంలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని సంప్రదించి, కనెక్షన్ ను పొందవచ్చని సూచించారు. వర్షం కురిసే సందర్భాల్లో విద్యుత్ పరికరాలు తడిచిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. వర్షంతో తడిచిన విద్యుత్ పరికరాలను చేతితో తాకకూడదని హెచ్చరించారు. వినాయకుడి నిమజ్జనం ఊరేగింపు సందర్భాల్లో కూడా విద్యుత్ సిబ్బంది సహకారంతో విద్యుత్తు లైన్ల కింద జాగ్రత్తగా దాటుకుంటూ వెళ్లాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడడం లేదా వేలాడుతుండడాన్ని గుర్తించినట్లయితే, వాటికి దూరంగా ఉంటూ వెంటనే తమ సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకుగానీ, సిబ్బందికి గానీ లేదా టోల్-ఫ్రీ నంబరు: 1912కు కాల్ చేసి సమాచారాన్ని అందించాలని కోరారు. వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి నిర్వాహకులకు అహగాహన కల్పించాలని సూచిస్తూ ఆయా సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో సురక్షితంగా జరుపుకోవాలని సిఎండి శివ శంకర్ లోతేటి ఆ ప్రకటనలో సూచించారు.

# నైవేద్య ప్రియుడు... స్వామివారు

### శ్రీవారికి నిత్యం వివిధ రకాల అన్నప్రసాదాల నైవేద్యం

### ప్రతి రోజూ నైవేద్యం, రాజభోగం, శయన భోగాలు

### నిత్యం శ్రీవారికి 45 ప్రసాదముల నివేదన

### 20రకాల అన్న ప్రసాద నైవేద్యములు 25రకాల పణ్యారములు

తిరుమల , సెప్టెంబర్ 11,మహి న్యూస్ : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిరోజూ వివిధ రకాల అన్నప్రసాదాలు, పిండి వంటలు, ఇతర రుచికరమైన పదార్థాలను శాస్త్రోక్తంగా



నైవేద్యంగా సమర్పిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో జరిగే నైవేద్య కైంకర్యాల్లో ఆయా సమయాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ప్రసాదాలను స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

### ప్రసాదాల వెనుక వైఖానస ఆగమ సంప్రదాయాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో నైవేద్యాలకు ప్రత్యేకమైన వైఖానస ఆగమ సంప్రదాయాలు ఉన్నాయి. ఆలయ పోటులో నైవేద్య పదార్థాలను అత్యంత పవిత్రతతో, సాంప్రదాయ పద్ధతులకు



అనుగుణంగా సిద్ధం చేస్తారు. నైవేద్య తయారీలో ఉపయోగించే పదార్థాలు, పాత్రలు, తయారీ విధానాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. శ్రీవారి నైవేద్యంలో ఎండుమిర్చి, పచ్చిమిర్చిని ఉపయోగించకుండా నల్లమిరియాలను వినియోగించడం ప్రాచీన సంప్రదాయంగా కొనసాగుతోంది. వైఖానస పరిభాషలో భక్తులు పులిహోరగా పిలుచుకునే ప్రసాదాన్ని 'తింత్రిణీరసాన్నం', నెయ్యి పొంగలిని 'ముద్గాన్నం', బెల్లం అన్నాన్ని 'గుడాన్నం', మిరియాల అన్నాన్ని 'మరీచ్యాన్నం', వడను 'మాషాపూపం', దోశను 'చక్రప్పం' అని పిలుస్తారు. ఈ సాంప్రదాయ పేర్లు, తయారీ విధానాలు శ్రీవారి నైవేద్యాల వెనుక ఉన్న ప్రాచీన ఆగమ సంప్రదాయాల ప్రత్యేకతను తెలియజేస్తాయి.

### నిత్యం 45 ప్రసాదాల నివేదన :

నైవేద్య ప్రియుడైన శ్రీవారికి అనునిత్యం 45 రకాల ప్రసాదాలను నివేదిస్తారు. వీటిలో 20రకాల అన్న ప్రసాద నైవేద్యములు కాగా మిగిలినవి పణ్యారములు కావడం విశేషం.

### మొదటి గంట అనంతరం ఉదయం నైవేద్యం

ఆలయంలో మొదటి గంట అనంతరం స్వామివారికి ఉదయం నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఈ సమయంలో మాత్రాన్నం, ముద్గాన్నం (నెయ్యి పొంగలి), తింత్రిణీరసాన్నం (పులిహోర), దధ్యోదనం (పెరుగన్నం), గుడాన్నం (బెల్లం అన్నం/చక్ర పొంగలి), శాకాన్నం (కదంబం అన్నం), శర్కరాన్నం (రవ్వకేసరి) వంటి ప్రసాదాలను సమర్పిస్తారు. వీటితో పాటు ప్రతిరోజూ నాలుగు రకాల పణ్యారములు లేదా పిండి వంటలను కూడా నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిలో లడుకం (లడ్డు), మాషాప్పం (వడ), గుడప్పం (అప్పం), చక్రప్పం (దోశ) ఉన్నాయి.

### రెండో గంట అనంతరం రాజభోగం

రెండో గంట అనంతరం స్వామివారికి మధ్యాహ్న నైవేద్యం లేదా రాజభోగాన్ని సమర్పిస్తారు. ఈ సమయంలో శుద్ధాన్నం (తెల్ల అన్నం), పులిహోర, గుడాన్నం, దధ్యోదనం, శీరా లేదా శక్కరభాత్ వంటి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

### మూడో గంట అనంతరం శయనభోగం

మూడో గంట అనంతరం రాత్రి నైవేద్యంగా శయనభోగాన్ని నిర్వహిస్తారు. ఈ సమయంలో మరీచ్యాన్నం (మిరియాల అన్నం), చక్రప్పం (దోశ), లడుకం (లడ్డు), మాషాప్పం (వడ), శర్కరాన్నం తదితర ప్రసాదాలను స్వామివారికి సమర్పిస్తారు.

### సాయంకాల ఆరాధనలో ప్రత్యేక కైంకర్యాలు

సాయంకాల ఆరాధన సమయంలో గర్భాలయాన్ని మరోసారి శుభ్రపరిచి, శ్రీవారిని తాజా పుష్పాలతో అలంకరిస్తారు. సాయంకాల కైంకర్యాల అనంతరం నిర్వహించే శయనభోగంలో భాగంగా అర్ధరాత్రి సమయంలో స్వామివారికి 'తిరువీసం' అనే ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పిస్తారు. తిరువీసంలో తెల్ల అన్నంతో పాటు బెల్లంతో తయారు చేసిన తీపి రుచిగల గుడాన్నం ఉంటుంది. రోజులో చివరిగా నిర్వహించే ఏకాంత సేవలో స్వామివారికి వెచ్చని పాలు, కాలానుగుణంగా లభించే ముక్కలుగా కోసిన పండ్లు, నెయ్యిలో వేయించిన ఎండు పండ్లు సమర్పిస్తారు.

### ప్రాచీన సంప్రదాయాలకు ప్రతీకగా నైవేద్య కైంకర్యాలు

శ్రీవారికి సమర్పించే నైవేద్యాలన్నీ ఆలయ సంప్రదాయాలు,



ఆగమ విధానాలకు అనుగుణంగా సిద్ధం చేసి సమర్పిస్తారు. ప్రతి నైవేద్యానికి ప్రత్యేకమైన పేరు, తయారీ విధానం, సమర్పించే సమయం ఉండటం తిరుమల ఆలయ వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. భక్తులు ప్రసాదంగా స్వీకరించే పులిహోర, పొంగలి, వడ, అప్పం తదితర పదార్థాల వెనుక ఇమిడి ఉన్న ఈ ప్రాచీన వైఖానస ఆగమ సంప్రదాయాలు శ్రీవారి నైవేద్యాల ప్రత్యేకతను మరింతగా తెలియజేస్తున్నాయి. ప్రతిరోజూ వివిధ సమయాల్లో నిర్వహించే ఈ నైవేద్య కైంకర్యాలు తిరుమల శ్రీవారి ఆలయ ప్రాచీన వైదిక, ఆగమ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

## తిరుపతి మేయర్ స్థానం జనసేనకు కేటాయిస్తే అత్యధిక మెజార్టీ తో గెలుస్తాం..

### ముక్తకంఠంతో జనసేన నాయకులు ఉద్ఘటన..




తిరుపతి, సెప్టెంబర్ 11 మహి న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో జనసేన పార్టీ బలమైన విజయాన్ని నమోదు చేయాలనే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తిరుపతి జిల్లా జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు పిలుపునిచ్చారు. తిరుపతి కార్పొరేషన్‌కు సంబంధించిన ప్రత్యేక సమీక్ష సమావేశం తిరుపతిలో నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు క్రికెట్ విజయ్ కుమార్, కిరణ్ రాయల్, కీర్తన, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో పార్టీ పరిస్థితి, సంస్థాగత బలోపేతం, ఎన్నికల వ్యూహాలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ, జనసేన అధినేత, ఉప




ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా బలోపేతమవుతోందని అన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేసి కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి నగరంలో జనసేనకు బలమైన కేడర్ ఉందని 62 వేలకు పైగా ఓట్లు తనకు మెజారిటీ రావడం ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకులకు కార్యకర్తలకు తగిన గుర్తింపు గౌరవం లభిస్తుందని హామి ఇచ్చారు. రానున్న తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి జనసేన నాయకుడు గెలుపు కోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. సమన్వయ కమిటీ సభ్యులు క్రికెట్ విజయ్ కుమార్, కిరణ్ రాయల్, కీర్తన మాట్లాడుతూ, తిరుపతి కార్పొరేషన్ పరిధిలో నిబంధనల మేరకు జనసేన పోటీ చేసే ప్రతి డివిజన్‌లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశిస్తే మేయర్ పదవికి కూడా జనసేన పోటీ చేయడానికి పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. తిరుపతి శాసనసభకు జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించడం, నగరంలో పార్టీ బలమైన సంస్థాగత నిర్మాణాన్ని కలిగి ఉండటం, అనేక నామినేటెడ్ పదవుల్లో జనసేనకు ప్రాతినిధ్యం ఉండటం పార్టీకి అనుకూల అంశాలుగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మేయర్ పదవి జనసేనకు కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు విజయాన్ని కానుకగా అందిస్తామని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తిరుపతి కార్పొరేషన్ పరిధికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు 'త్రిశూల్' కార్యాచరణ

### జీరో డ్రగ్స్.. మహిళలపై వేధింపులకు జీరో టాలరెన్స్.. జీరో రోడ్డు ప్రమాదాలే లక్ష్యం

### జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు కీలక దిశానిర్దేశం చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో శాంతిభద్రతల అంశంపై సమీక్ష నిర్వహించిన సీఎం.. మూడు ప్రధాన లక్ష్యాలతో 'త్రిశూల్' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జీరో డ్రగ్స్, మహిళలపై వేధింపులకు జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలో డీ-అడిక్షన్ ఎక్సలెన్స్



సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, అభ్యంతరకర కంటెంట్, వ్యవస్థీకృత వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న 30 మంది కానిస్టేబుళ్లను జిల్లాలకు కేటాయించినట్లు సీఎం తెలిపారు. సైబర్ టెక్నాలజీలో నిపుణులతో సీఐడీలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై మంత్రుల కమిటీ మరింత లోతుగా అధ్యయనం చేయాలని అన్నారు.

### రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. ప్రతి ప్రమాదాన్ని ఆడిట్ చేసి, ప్రమాదానికి గల కారణాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్ ఎంత సమయంలో చేరుకుంటోంది, రహదారి పరిస్థితులు, ఇతర కారణాలను సమగ్రంగా విశ్లేషించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల విషయంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండటం ఆందోళనకరమని, ఈ పరిస్థితిని మార్చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

### నేరాల నియంత్రణలో పురోగతి

గత రెండేళ్లలో రాష్ట్రంలో నేరాలు 14 శాతం మేర తగ్గాయని ముఖ్యమంత్రి తెలిపారు. నేరాల నియంత్రణపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక నేరాలు కూడా తగ్గుముఖం పట్టాయని, అయితే కొన్ని జిల్లాల్లో ఆర్థిక నేరాలు ఎందుకు పెరుగుతున్నాయో అధికారులు విశ్లేషించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదయ్యే నేరాలు 29.2 శాతం తగ్గాయని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు రెండేళ్లలో 3 శాతం మేర పెరిగిందన్నారు.

### దర్యాప్తు వేగం పెంచాలి

కీలక కేసుల్లో డీఎన్ఏ పరీక్షల ఫలితాలు వచ్చే సమయాన్ని మరింత తగ్గించాలని సీఎం సూచించారు. నేరం జరిగిన ప్రాంతానికి పోలీసులు 30 నిమిషాల్లోపు చేరుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. నేరం జరిగిన ప్రదేశానికి పోలీసులు ఎంత త్వరగా చేరుకుంటే అంత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కన్విక్షన్ రేట్ 47 శాతంగా ఉందని, శాస్త్రీయ ఆధారాలను పక్కాగా సేకరించడం ద్వారా దోషులకు శిక్ష పడే శాతాన్ని మరింత పెంచవచ్చని అన్నారు. కోర్టు కేసుల పరిష్కారంలో 'వన్ కోర్టు--వన్ కానిస్టేబుల్' విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రాంతీయ స్థాయిలో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలను ఏర్పాటు చేయడంతో పాటు, డాగ్ స్క్వాడ్‌లను కూడా బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రతి జిల్లాలో 30 మంది పోలీసులతో జిల్లా యాక్షన్ అండ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీజీపీ కార్యాలయంలో సెంట్రల్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటు

## పుడిచెర్ల లబ్ధిదారులకు రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

## ఎన్.కొంతలపాడులో సుంకులమ్మ ఆలయానికి 20 సెంట్ల స్థలం కేటాయింపు





ఓర్వకల్లు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): ఓర్వకల్లు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన "మీ భూమి--మీ హక్కు" కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు మండలం పుడిచెర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను గౌరు చరిత రెడ్డి పంపిణీ చేశారు. భూ హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందని గౌరు చరిత రెడ్డి తెలిపారు. అర్హులైన భూ యజమానులకు వారి భూములపై హక్కులను సక్రమంగా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్.కొంతలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సుంకులమ్మ అమ్మవారి ఆలయానికి 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. దీనికి సంబంధించిన మంజూరు పత్రాన్ని గౌరు చరిత రెడ్డి, మండల తహసీల్దార్ కలిసి గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

## గ్రీవెన్స్ డేలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

## తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం




కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): కర్నూలు మాధవి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్ డేకు వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

## 'ఒక్క నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా మంత్రాలయంలో ప్రజా వినతుల స్వీకరణ



కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఒక్క నెల--ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంత్రాలయం నియోజకవర్గంలో తొలి పర్యటన నిర్వహించారు. మంత్రాలయం మండల కేంద్రంలోని హెచ్ఆర్‌బీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు రెవెన్యూ, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, గృహ వసతి, పింఛన్లు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి, సంబంధిత సమస్యలను ఆయా శాఖలకు పంపించి, ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి లేకుండా, అందిన వినతులపై బాధ్యతాయుతంగా స్పందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజా కృష్ణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందేలా చర్యలు

## పార్టీ నాయకులతో పింఛన్లపై ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సమీక్ష



కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): మాధవినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, అర్బన్ పరిధిలోని 16 వార్డుల ఇన్‌చార్జిలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ నాయకులతో నూతన ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డితో కలిసి పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల అర్హతలు, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, పింఛన్ల పంపిణీ ప్రక్రియ తదితర అంశాలపై పార్టీ నాయకులకు ఎమ్మెల్యే వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నాయకులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పింఛన్లకు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సూచించారు.



# ఫైళ్ల క్లియరెన్స్‌పై సీఎం చంద్రబాబు సీరియస్

## నిర్ణీత సమయంలో ఫైళ్లను క్లియర్ చేయకపోవడంపై అధికారులకు క్లాస్

## కలెక్టర్ల సదస్సుకు గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం



అమరావతి, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను నిర్ణీత సమయంలో త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలన వేగవంతంగా సాగాలంటే ఫైళ్ల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఫైళ్ల క్లియరెన్స్‌పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి, నిర్ణీత సమయంలో ఫైళ్లను పరిష్కరించకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ల సదస్సుకు కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు గైర్హాజరు కావడంపై వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రెండు రోజులు లేదా అంతకంటే తక్కువ సమయంలో ఫైళ్లను పరిష్కరించిన అధికారులందరినీ అభినందించారు. అదే విధంగా సున్నా రోజులోనే ఫైళ్లను పూర్తి చేసిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నాలుగు రోజుల సమయం తీసుకుంటున్న మంత్రులు ఫైళ్లను మరింత వేగంగా పరిష్కరించాలని సూచించారు. పాలనలో వేగం పెరగాలంటే ఫైళ్ల పరిష్కారం కూడా అదే స్థాయిలో వేగంగా ఉండాలని అన్నారు. ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలను తీసుకుని రూపొందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాల ఆధారంగానే అధికారుల పనితీరును మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఫైళ్ల నిర్వహణను ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టాలని, ఇందుకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇకపై మాన్యువల్‌గా ఫైళ్లను నిర్వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. మాన్యువల్ ఫైళ్ల నిర్వహణపై నెల రోజుల్లోగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి, ఈ అంశంపై మంత్రులు కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.






# కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కర్నూలు కలెక్టర్‌కు సీఎం ప్రశంసలు

## 1.98 లక్షల ఎకరాల్లో పీఎండీఎస్ సాగు

## తక్కువ వర్షపాతం ప్రాంతాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని సీఎం సూచన



కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరికి ప్రత్యేక ప్రశంసలు లభించాయి. ఆయా జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై కలెక్టర్లు వివరిస్తున్న సందర్భంగా కర్నూలు జిల్లాలో అమలు చేస్తున్న పీఎండీఎస్ (ప్రావీణ్యా) సాగు విధానం, దాని ద్వారా రైతులు సాధిస్తున్న ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ డా. ఏ.సిరిని ప్రత్యేకంగా అభినందించారు. కర్నూలు జిల్లాలో 1.27 లక్షల హెక్టార్లలో పీఎండీఎస్ సాగు లక్ష్యంగా ఉండగా, అదనంగా మరో లక్ష ఎకరాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1.98 లక్షల ఎకరాల్లో పీఎండీఎస్ సాగు విధానాన్ని అమలు చేసినట్లు వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 55 వేల ఎకరాలు, ఉద్యాన శాఖ ద్వారా 38 వేల ఎకరాలు, ఖాళీ భూముల్లో 5 వేల ఎకరాలు, చెరువు కట్టలు, ట్యాంక్ బెడ్లలో 5 వేల ఎకరాల్లో పశు గ్రాసం సాగును ఈ విధానం ద్వారా చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు.

### నేల ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం

పీఎండీఎస్ సాగు విధానం ద్వారా నేలకు, పంటలకు అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని కలెక్టర్ వివరించారు. ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు అందుబాటులోకి రావడంతో మొక్కల వేర్లు వాటిని సమర్థవంతంగా గ్రహిస్తాయని తెలిపారు. ఈ విధానం వల్ల నేల గుల్లబారి వానపాముల వృద్ధికి అనుకూలంగా మారుతుందని, నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. బహుళ పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు నేల కోత తగ్గడం, జీవ వైవిధ్యం పెరగడం, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. అలాగే ప్రధాన పంటలో కలుపు, చీడపీడలు, తెగుళ్ల ప్రభావం తగ్గడంతో పాటు పంటలు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని, దిగుబడులు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. పీఎండీఎస్ సాగు చేపట్టిన భూముల్లో నేల ఉష్ణోగ్రత కూడా గణనీయంగా తగ్గినట్లు కలెక్టర్ వివరించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసి నవధాన్యాలను సాగు చేయడం ద్వారా రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయని తెలిపారు.

### రైతులకు ఆదర్శంగా విజయగాథలు

పీఎండీఎస్ సాగు ద్వారా కర్నూలు జిల్లాలో రైతులు సాధించిన విజయాలను కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి, ఇతర అధికారులకు వివరించారు. గూడూరు మండలానికి చెందిన రైతు జి.శేఖర్ తన 2.2 ఎకరాల పొలంలో పీఎండీఎస్ విధానంలో వివిధ పంటలను సాగు చేసి, తక్కువ పెట్టుబడితో రూ.97 వేల నికర ఆదాయాన్ని సాధించినట్లు తెలిపారు. దీంతో ఆయన తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారని వివరించారు. అదేవిధంగా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన రైతు రంగస్వామి పీఎండీఎస్ విధానంలో సాగు చేపట్టి, అన్ని ఖర్చులు పోను రూ.1.37 లక్షల ఆదాయాన్ని పొందినట్లు కలెక్టర్ వెల్లడించారు.

### తక్కువ వర్షపాతం ప్రాంతాల్లో అమలు చేయాలి

కర్నూలు జిల్లాలో అమలు చేస్తున్న పీఎండీఎస్ సాగు విధానం బాగుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ఈ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# మట్టి వినాయకుడే ముద్దు.. పర్యావరణానికి రక్ష

## కర్నూలు వినాయక ఘాట్‌లో ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కేంద్రం ప్రారంభం



కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు కర్నూలులో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు వినాయక ఘాట్‌లో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీపీసీబీ చైర్మన్, కర్నూలు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ వినాయక ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పి.వి. కిషోర్ రెడ్డి ముఖ్య అతిథులు, ఇతర ప్రముఖులను సన్మానించారు.



### 50 విద్యాసంస్థల విద్యార్థులతో మట్టి విగ్రహాల తయారీ పోటీలు

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని సుమారు 50 పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ఏపీపీసీబీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణం, జలవనరులకు నష్టం కలిగే అవకాశం ఉన్నందున ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని అధికారులు సూచించారు. పర్యావరణహితమైన విగ్రహాల వినియోగాన్ని పెంచడం, ప్రజలు, విద్యార్థులు, వినాయక ఉత్సవ కమిటీల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.




### పర్యావరణహితంగా వినాయక చవితి

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ జరుపుకోవాలని ఏపీపీసీబీ, కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మట్టి విగ్రహాలను అధికంగా వినియోగించడం ద్వారా పర్యావరణం, జలవనరులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సెట్‌కూర్ సీఈఓ వేణుగోపాల్, డీసీఐఎఫ్ నారాయణ రెడ్డి, డీసీఎల్ వెంకటేశ్వర్లు, ఏపీపీసీబీ జోనల్ కార్యాలయం ఎస్ఈఈ నరేంద్రబాబు, జీఎస్ఓ జి. నరసింహులు, లయన్స్ క్లబ్ కర్నూలుకు చెందిన రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జైలులో ఖైదీల సమస్యలపై ఆరా

## భోజనం, వసతులు, వైద్య సేవలు, పరిశుభ్రతను పరిశీలించిన బోర్డ్ ఆఫ్ విజిటర్స్

కర్నూలు, సెప్టెంబర్ 11: (మహి న్యూస్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యుల బృందం శుక్రవారం కర్నూలు జిల్లా కారాగారాన్ని సందర్శించింది. ఖైదీల సంక్షేమం, వారికి అందుతున్న సౌకర్యాలు, జైలు నిర్వహణ తీరును బృందం సమగ్రంగా పరిశీలించింది. బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ పి. వాసు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, జిల్లా అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, రెవెన్యూ డివిజనల్ అధికారి సందీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

### ఖైదీలతో నేరుగా మాట్లాడిన న్యాయమూర్తి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖైదీలతో బృందం నేరుగా మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలు, అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకుంది. ఖైదీలకు అందిస్తున్న భోజనం, వసతులు, బ్యారక్‌ల పరిస్థితి, పరిశుభ్రత, జైలు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, జైలు వంటశాలను పరిశీలించారు. అధికారులు స్వయంగా ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.



### ఉచిత న్యాయ సహాయంపై మార్గదర్శకాలు

ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయం, బెయిల్ మంజూరు పరిస్థితి, షూరిటీ సమర్పించలేని ఖైదీలకు వ్యక్తిగత బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకాలు చేశారు. జైలు ప్రాంగణంలోని పచ్చదనం, పరిశుభ్రత, క్రమశిక్షణపై బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

### లీగల్ ఎయిడ్ హెల్ప్‌డెస్క్ తనిఖీ

ఈ సందర్భంగా జైలులో ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ హెల్ప్‌డెస్క్, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలపై వివరాలు తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 15100పై ఖైదీలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యులు, జిల్లా అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, రెవెన్యూ డివిజనల్ అధికారి సందీప్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కామేశ్వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వరలక్ష్మి, పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్, ఉపాధి కల్పన అధికారి దీప్తి, జిల్లా పరిశ్రమల అధికారి సంజీవ రాజు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు, సులోచన, లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాదులు రాందాసు, బద్దల్ లక్ష్మీనారాయణ, అబ్దుల్ అజీజ్, పారా లీగల్ వాలంటీర్లు హేమంత్, శివాని, జైలర్ యెరికల నాయుడు, జైలు అధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
వై ఎస్ ఆర్ కడప జిల్లా
శనివారం - 12 - సెప్టెంబర్ - 2026

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

## జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ




కడప జిల్లా/జమ్మలమడుగు, సెప్టెంబరు 11, (మహి న్యూస్): జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన అర్జీలలో ప్రధానంగా జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన ఎస్. పర్వీన్‌కు వితంతు పింఛన్ మంజూరు చేయాలని, మైలవరం మండలానికి చెందిన మహేష్‌కు వికలాంగుల పింఛన్ అందించాలని కోరారు. అలాగే పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, అదే గ్రామంలోని ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికలకు ప్రహరీ, నీటి వసతి కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీ దళితవాడలో స్మశాన వాటిక మంజూరు చేయాలని కోరుతూ మరో అర్జీ సమర్పించారు. కొండాపురం మండలం దొబ్బుడుపల్లె గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడే జాతీయ లోక్ అదాలత్

## జిల్లా వ్యాప్తంగా 29 బెంచీల ఏర్పాటు..

## రాజీ ద్వారా సత్వర న్యాయం పొందే అవకాశం



కడప జిల్లా, మహి న్యూస్, సెప్టెంబరు 11: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు కడప జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో సెప్టెంబరు 12న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను పరస్పర అంగీకారంతో రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందే అవకాశం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 29 బెంచీలను ఏర్పాటు చేశారు. ఇందులో కడపలో 8, ప్రొద్దుటూరులో 5, రాజంపేటలో 3, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2 బెంచీలు ఏర్పాటు చేశారు. సిద్ధవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచీ ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంకు అధికారులు, బీమా సంస్థల అధికారులు, కార్మిక శాఖ అధికారులు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామగోపాల్, కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కోరారు.

మరింత సమాచారం కోసం:
ఫోన్: 08562-258622, 08562-244622
ఈమెయిల్: dlsakdp@gmail.com

## ప్రధాన జిల్లా న్యాయమూర్తిని కలిసిన రిమ్స్ సూపరింటెండెంట్

### జి. రామగోపాల్‌కు శుభాకాంక్షలు తెలిపిన కె. పెంచలయ్య



కడప జిల్లా, మహి న్యూస్, సెప్టెంబరు 11: కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి. రామగోపాల్‌ను రిమ్స్ సూపరింటెండెంట్ కె. పెంచలయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిమ్స్ సూపరింటెండెంట్ కె. పెంచలయ్య పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయ, వైద్య రంగాలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు పరస్పరం చర్చించుకున్నారు.

## పీఆర్ఎస్ వైఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి




రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 11 : పీఆర్ఎస్ వైఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కో -కన్వీనర్ ఓరుగంటి నాగేంద్ర బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని దివ్యతేజ ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను కరస్పాండెంట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పైన రాజీ లేని పోరాటాలు చేస్తూ, వారి సమస్యలు పరిస్కార దిశగా ఆందోళనలు చేస్తూ, రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాలు, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, పాలకవర్గాలపై ఒత్తిడి తెచ్చే విధంగా ముందుకు సాగుతున్న పీఆర్ఎస్ వైఎఫ్ సంఘాన్ని నాయకత్వాని అభినందించారు. అనంతరం నాగేంద్రబాబు మాట్లాడుతూ ఈ నెల 24 25న జరిగే సభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెంకటరమణ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు కొత్త పింఛన్లు అందేలా కృషి చేయాలి

### ఈ నెల 16లోగా పింఛన్ల కోసం దరఖాస్తు చేయించే బాధ్యత పార్టీ శ్రేణులదే



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్, సెప్టెంబరు 11: జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి సమావేశానికి హాజరై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో నెలలుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేద ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్త పింఛన్ల నమోదుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ, ఒంటరి మహిళ తదితర పింఛన్లకు అర్హత ఉన్న పేదలను పార్టీ శ్రేణులు గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలకు తీసుకెళ్లి పింఛన్ కోసం దరఖాస్తు చేయించేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అర్హత ఉన్న ఒక్క పేద కుటుంబం కూడా అవకాశం కోల్పోకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బిర్రు సంతోష్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భక్తితో పాటు.. భాధ్యతనూ స్వీకరించాలి..!!

## మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

## పీఓపీ, ప్లాస్టిక్, థర్మోకోల్‌కు దూరంగా ఉండాలి.. సహజ పదార్థాలతోనే అలంకరణ

## నిర్దేశిత ప్రాంతాల్లోనే నిమజ్జనాలు చేయాలని సూచన

## నీటి వనరుల పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి అవగాహన




కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 11 : భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వీకరించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీరింగ్ అధికారులు కడప ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. వినాయక విగ్రహాల తయారీ, అలంకరణ, నిమజ్జనం విషయంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన మార్గదర్శకాలను పాటిస్తూ పర్యావరణహిత పండుగను నిర్వహించాలని సూచించింది. విగ్రహాల తయారీలో సహజంగా కరిగిపోయే, పర్యావరణహిత పదార్థాలను వినియోగించాలని, ముఖ్యంగా సంప్రదాయ మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు. పీఓపీతో పాటు ప్లాస్టిక్, థర్మోకోల్ వంటి పదార్థాలతో తయారుచేసిన విగ్రహాలను వినియోగించకుండా ప్రజలు సహకరించాలని కోరారు. విగ్రహాలకు రంగులు వేసే సందర్భంలో కూడా నీటిలో కరిగే, విషరహిత సహజ రంగులనే ఉపయోగించాలని సూచిస్తున్నారు. విగ్రహ నిమజ్జనం సమయంలో సహజ నీటి వనరులు కలుషితం కాకుండా స్థానిక సంస్థలు ఏర్పాటు చేసే నిర్దేశిత ప్రాంతాలు లేదా తాత్కాలిక కృత్రిమ నిమజ్జన కొలనులను మాత్రమే వినియోగించాలని అధికారులు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, సురక్షితంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే పూలు, వస్త్రాలు, అలంకరణ సామగ్రి, ప్లాస్టిక్ తదితర పూజా సామగ్రిని విగ్రహంతో పాటు నీటిలో వేయకుండా ముందుగానే తొలగించాలని సూచించారు. కరిగిపోయే వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి కంపోస్టింగ్ లేదా పునర్వినియోగానికి, కరగని వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్న మట్టి విగ్రహాలను పూజించే కుటుంబాలు ఇంటి వద్దే నీటితో నింపిన బకెట్ లేదా తగిన పాత్రలో నిమజ్జనం చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. విగ్రహం పూర్తిగా కరిగిన తర్వాత ఆ నీటిని తోటలకు వినియోగించుకోవడంతో పాటు మిగిలిన మట్టిని ఎండబెట్టి మొక్కలు, తోటల్లో తిరిగి ఉపయోగించుకోవచ్చని సూచించారు.

### భక్తితో పాటు... భాధ్యతనూ స్వీకరించాలి..!

"వినాయక చవితి సందర్భంగా భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా మన బాధ్యతగా భావించాలి. మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి, పీఓపీ, ప్లాస్టిక్, థర్మోకోల్ వంటి పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండాలి. మండపాల అలంకరణలో సహజ పదార్థాలను వినియోగించాలి. విగ్రహాల నిమజ్జనాన్ని నదులు, చెరువులు, కుంటల్లో నేరుగా చేయకుండా నిర్దేశిత నిమజ్జన ప్రాంతాల్లోనే నిర్వహించాలి. పూజా సామగ్రిని కూడా విగ్రహంతో పాటు నీటిలో వేయకుండా ముందుగానే వేరు చేసి తగిన విధంగా నిర్వహించాలి. చిన్న మట్టి విగ్రహాలను ఇళ్ల వద్దే పాత్రల్లో నిమజ్జనం చేసుకుని, ఆ మట్టిని మొక్కలు, తోటలకు వినియోగించుకోవచ్చు. ప్రతి ఒక్కరి చిన్నపాటి జాగ్రత్తే మన నీటి వనరులను, పర్యావరణాన్ని కాపాడుతుంది".

**- సుధా కురబ, ఈఈ.,**

కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప.

వినాయక చవితి సందర్భంగా విగ్రహ తయారీదారులు, వ్యాపారులు, పూజా నిర్వాహక కమిటీలు, భక్తులు పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని కాలుష్య నియంత్రణ మండలి కోరింది. మట్టి వినాయకుడిని పూజిస్తూ.. ప్లాస్టిక్‌కు దూరంగా ఉంటూ.. సహజ రంగులను వినియోగిస్తూ.. నిర్దేశిత ప్రాంతాల్లోనే నిమజ్జనం నిర్వహించడం ద్వారా పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకుందాం అని పిలుపునిచ్చింది.

# కేజీబీవీ బాలికల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి..!

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి. వెంకట పద్మలత

## విద్యార్థినుల భద్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## ప్రతి ఉపాధ్యాయురాలూ విద్యార్థుల గ్రూపును దత్తత తీసుకుని మార్గదర్శనం చేయాలి

## సమస్యలు ఎదురైతే '1098' టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలి



మైదుకూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 11: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో విద్యార్థినుల భద్రత, ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల



పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి. వెంకట పద్మలత సూచించారు. మైదుకూరు పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వంటగది, భోజనశాల, వసతి గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించి విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా.. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన



తాగునీరు, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన పద్మలత మాట్లాడుతూ... విద్యార్థినులను చిన్న చిన్న బృందాలుగా విభజించి ప్రతి ఉపాధ్యాయురాలు ఒక బృందానికి బాధ్యత వహించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి వ్యక్తిగత శ్రద్ధతో బోధించాలని, ప్రతి విద్యార్థిని పాఠ్యపుస్తకాలను స్పష్టంగా, సంపూర్ణంగా చదివేలా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. బాలికల ఆసక్తులకు అనుగుణంగా ప్రస్తుత నైపుణ్యాభివృద్ధి శిక్షణలతో పాటు మరిన్ని ఆధునిక నైపుణ్యాలను అందించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయురాలు కొంతమంది విద్యార్థినులతో కూడిన ఒక బృందాన్ని దత్తత తీసుకుని, వారి చదువు, వ్యక్తిగత సమస్యలు, నైపుణ్యాభివృద్ధిపై నిరంతరం మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన ఆమె వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని ఫిర్యాదుల పెట్టె, సూచనల పెట్టె నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో లేదా వసతి గృహంలో రక్షణకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే 1098 చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని బాలికలకు సూచించారు. బాల్య వివాహాలు, వేధింపులు, ఇతర బాలల హక్కుల ఉల్లంఘనలపై అప్రమత్తంగా





ఉండాలని అవగాహన కల్పించాలని. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన పద్మలత, యుక్తవయస్సు గర్భధారణ నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల నిరోధానికి అప్రమత్తంగా పనిచేస్తూ, కౌమార దశ బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత నివారణ, బాలల హక్కులపై నిరంతరం అవగాహన కల్పించాలని చెప్పారు. బాలికల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన సహాయం, కౌన్సెలింగ్ అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారి పి. రమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.ఆర్. సుభాష్ యాదవ్, సమగ్ర శిక్ష డీఐఈ కోఆర్డినేటర్ కె. వెంకట సుబ్బయ్య, సీడీపీవోలు,





సంబంధిత శాఖల అధికారులు, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి ప్రశంసలు

## ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్న కలెక్టర్ చర్యలు అభినందనీయం

## సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు జిల్లా కేంద్రంలో ఉచిత భోజన సదుపాయం

## ప్లాస్టిక్ రహిత విధానంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసుల వినియోగం

## వాగులు, వంకల వద్ద 14 అదనపు కల్వర్టులు/వంతెనలకు మంజూరు -- కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల,మహి న్యూస్ సెప్టెంబరు 11 : ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై అధికారులు వేగంగా స్పందిస్తూ, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్న నంద్యాల జిల్లా యంత్రాంగం పనితీరును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రాధాన్యతనిస్తూ, వినూత్న విధానాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని ముఖ్యమంత్రి అభినందించారు. లిఅమరావతిలోని రాష్ట్ర సచివాలయం 5వ బ్లాక్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 8వ కలెక్టర్ల సదస్సు రెండో రోజు సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను కలెక్టర్ ముఖ్యమంత్రికి నివేదించారు.

వాగులు, వంకల వద్ద 14 అదనపు కల్వర్టులు/వంతెనలకు మంజూరు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఆళ్లగడ్డ మండలం జంబులదిన్నె గ్రామ ప్రజలు వాగు దాటి స్మశాన వాటికకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి కల్వర్టు నిర్మాణానికి మంజూరు చేసి పూర్తి చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఇదే విధంగా జిల్లాలో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న వాగులు, వంకలను గుర్తించి అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 14 కల్వర్టులు/వంతెనల నిర్మాణానికి మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. మంజూరైన పనుల్లో దాదాపు అన్ని పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని కలెక్టర్ సీఎంకు నివేదించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం పరిష్కరించడమే కాకుండా, సమస్యకు మూలకారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారని ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు.

సుదూర ప్రాంతాల ప్రజలకు ఉచిత భోజన సదుపాయం

శ్రీశైలం, పాణ్యం, ఆత్మకూరు, నంద్యాల తదితర సుదూర ప్రాంతాల నుంచి సుమారు 400 మంది ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రావడానికి రెండు నుంచి మూడు గంటల సమయం పడుతున్న నేపథ్యంలో, జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రజలకు భోజనం అందించడంతో పాటు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. డిస్పోజబుల్ ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను వినియోగిస్తూ ప్లాస్టిక్ రహిత విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు సౌకర్యవంతంగా కూర్చుని భోజనం చేసేలా తగిన ఏర్పాట్లు చేసినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారుల స్పందన, గ్రీవెన్స్ నిర్వహణ విధానం, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్న జిల్లా యంత్రాంగం పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com